Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 241 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 సెప్టెంబర్ 2023 బుధవారం పేజీలు : 4

### వేగంగా క్షీణిస్తున్న జపాన్ జనాభా.. త్వరలో అదృశ్యం

టోక్యో: జపాన్‌లో జనాభా వేగంగా క్షీణిస్తోంది. జననాల రేటు తీవ్రంగా తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. జననాల రేటు క్షీణించడాన్ని తగ్గించకపోతే జపాన్ అదృశ్యమైపోతుందని స్వయం గా ప్రధానమంత్రి ఫుమియో కిషిడా సలహాదారు మసాకో మోరి చెప్పారు. గత నెల 28న విడుదలైన నివేదికలో జననాల రేటు గణనీయ స్థాయిలో పడిపోతుందని వెల్లడైంది. గత ఏడాది జననాల సంఖ్య కన్నా మరణాల సంఖ్య రెట్టింపుగా నమోదైంది. 2022లో 8 లక్షల జననాలు రికార్డయ్యాయి. అదే సమయంలో 15.8 లక్ష ల మరణాలు నమోదయ్యాయి. దేశ జనాభా కూడా పడిపోతోంది. జపాన్ ప్రస్తుత జనాభా 12.4 కోట్లు. జననాల రేటు క్షీణించడాన్ని అడ్డుకోకపోతే సామాజిక భద్రతా వ్యవస్థ కుప్పకూలడంతో పాటు ఆర్థిక ప్రగతి కూడా దెబ్బతింటుందని మసాకో మోరి చెబుతున్నారు.

# దిశా నిర్దేశం

హైదరాబాద్ : తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాల్సిందేనని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్పష్టం చేసారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ కు సానుకూలత కనిపిస్తోందని.. తెలంగాణలోనూ పరిస్థితి అనుకూలంగా ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతీ సందర్భం గెలుపుకు అనుకూలంగా మలచుకోవాలని నిర్దేశించారు. తెలంగాణ పార్టీ కోసం సమయం కేటాయించటానికి తాను సిద్దంగా ఉన్నానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రావాల్సిందే ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా ఈ సారి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో అధికారం దక్కించుకోవాలని సోనియా గాంధీ నిర్దేశించారు. వచ్చే నాలుగు నెలల పాటు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అధికారమే లక్ష్యంగా ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. సీడబ్ల్యూసీ సమావేశాల సమయంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రత్యేకగా సోనియా సమావేశమయ్యారు. తెలంగాణలో రాజకీయ పరిస్థితులను ఆరా తీసారు. తెలంగాణలో ఎన్నకల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సోనియా స్పష్టం చేసారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో గ్యారంటీ కార్డు స్కీముల హామీ బాగా పని చేసిందని..తెలంగాణలో ప్రకటించే గ్యారంటీ కార్డెకార్డు స్కీములను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది.

**తెలంగాణపై ఫోకస్** : హామీలు ఇవ్వటంతో పాటుగా..వాటికి పార్టీ కట్టుబడి ఉంటుందని ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు వెళ్లాలని సూచించారు. కర్ణాటకలో ఇప్పటికే నాలుగు గ్యారంటీ కార్డు స్కీమ్ లు అమలు, హిమాచల్ ప్రదేశ్ లో ప్రభుత్వ ఉద్యోగులకు పాత ఫించన్ విధానం పునరుద్దరణ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని నిర్దేశించారు.

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ కోసం తాను తగిన సమయం ఇస్తానని పార్టీ నేతలకు సోనియా హామీ ఇచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పాటుగా రాహుల్, ప్రియాంకల సేవలను వినియోగించుకోవాలని సూచించినట్లు పార్టీ నేతల సమాచారం. ఇదే సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్రం ఏర్పాటు చేసామని సోనియా వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. గ్యారంటీ స్కీంలతో ముందుకు అటువంటి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి, శ్రేయోధనంలోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. సీడబ్ల్యూసీ సామవేశాల నిర్వహణ తో తెలంగాణలో నూతన అధ్యాయం ప్రారంభం కావాలని సూచించారు. తెలంగాణ ప్రతీ రంగంలోని అగ్రభాగాన నిలుస్తూ..ఆత్మ గౌరవంతో బతికేలా తెలంగాణను..దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని సోనియా తెలంగాణ కాంగ్రెస్ నేతలకు స్పష్టం చేసారు. ఇక ఈ రోజు జరిగే బహిరంగ సభలో కాంగ్రెస్ ఎన్నికల గ్యారంటీ హామీలను ప్రకటించనున్నారు. ఇదే సమంయలో తెలంగాణ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయా..ప్రచారం జరుగుతన్నట్లుగా వాయిదా పడతాయా అనేది మరో ఆసక్తి కర చర్చ సాగుతోంది.

దీని పైన రేపటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.




## కాంగ్రెస్ నేతలకు పక్కా రూట్ మ్యాప్ ఇచ్చిన సోనియా!

# ఇక ఆచరణే తరువాయి!!




## జగన్ గెలిచేందుకు కేసీఆర్ సూట్‌కేసులు అందించారు

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు అరెస్ట్ వెనుక తెలంగాణ సీఎం కేసీఆర్ ఉన్నారన్నారు. ఆయన అక్రమ అరెస్టును మధుయాష్కీ ఖండించారు. ఏపీ సీఎం జగన్, కేసీఆర్ కుమ్మక్కై చంద్రబాబును అరెస్ట్ చేయించారన్నారు. జగన్ గెలిచేందుకు కేసీఆర్ సూట్‌కేసులు అందించారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, వైసీపీ ఒక్కటేనని మధుయాష్కీ అన్నారు. కేసీఆర్, జగన్, ప్రధాని మోదీ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు గమనించాలని మధుయాష్కీ అన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ఉచిత కరెంటు కాస్తా.. ఉత్త కరెంటే అయింది : మంత్రి హరీశ రావు



సంగారెడ్డి : పరిపాలన వికేంద్రీకరణ జరగాలని, పాలన ప్రజలకు చేరువ కావాలని సీఎం కేసీఆర్ ఆకాంక్ష. అందులో భాగంగానే కొత్త జిల్లాలు, గ్రామాలు, మండలాలను ఏర్పాటు చేశారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి అన్నారు. కాంగ్రెస్ పాలనలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంట్ అన్నడు. అది ఉత్త కరెంట్ అయ్యింది. నాడు కాలిపోయే మోటార్లు, పేలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లు మాత్రమే దర్శనమిచ్చేవని ఆ పార్టీపై మండిపడ్డారు. మంగళవారం జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గం, తడ్కల్ మండలంలో మైనార్టీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు గులాబీ పార్టీలో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..30 ఏండ్ల మందం ఏర్పాటు కలను నిజం చేసింది సీఎం, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. స్వరాష్ట్రంలో నారాయణ్ ఖేడ్ రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. రెవెన్యూ డివిజన్ అయింది. కొత్త మండలాలు అయ్యాయి. 100 కొత్త గ్రామ పంచాయతీలు చేసుకున్నాం. మొత్తం 223 గ్రామ పంచాయతీలు అయ్యాయి. రెవెన్యూ డివిజన్ల సంఖ్యను 43 నుంచి 74 వరకు, మండలాల సంఖ్యను 459 నుంచి 612 వరకు, గ్రామ పంచాయతీల సంఖ్యను 12,769 వరకు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ జూటా మాటలు, అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు.

కాంగ్రెస్‌ను నమ్మితే కుక్క తోక వంకరే అన్న చందంగా ఉంటుందని పేర్కొన్నారు. కర్ణాటకలో ఉచిత బస్సు అన్నారు. ఉ న్న బస్సు బంద్ పెట్టారు. కాంగ్రెస్ నాలుగు వేలు పింఛన్ కర్ణాటకలో ఇచ్చి మాట్లాడాలని డిమాండ్ చేశారు. కన్నతల్లికి అన్నం పెట్టలేనోడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్తడటని ఎద్దేవా చేశారు. భుజాలు నొప్పి పెట్టేలా నాడు మహిళలు నీళు మోసారు. నేడు ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు ఇచ్చింది కేసీఆర్. లక్ష రూపాయల రుణమాఫీ కొనసాగుతున్నది. అర్హులందరికీ మాఫీ అవుతాయని చెప్పారు. మాట చెబితే మడమ తిప్పని పార్టీ బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



# దక్షిణాదిని చుట్టేయాలని!!

## చకచకా పావులు కదుపుతున్న కాంగ్రెస్!!

హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఢిల్లీకి బయట పార్టీ సీడబ్ల్యూసీ సమావేశం జరగటం ఇదే మొదటిసారి. ఇదేదో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అడిగారని నిర్వహించలేదు. చాలా వ్యూహాత్మకంగానే పార్టీ పెద్దలు సీడబ్ల్యూసీ సమావేశం ఇక్కడ నిర్వహించినట్లు అర్థమవుతోంది. ఎందుకంటే శనివారం జరిగిన మొదటి రోజు సమావేశం మొత్తం జాతీయ రాజకీయాలపైనే జరిగింది. మొదటిరోజు సమావేశం సారాంశం ఏమిటంటే దక్షణాదిలో కాంగ్రెస్ బలపడేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనే చర్చించారు. ముదు తెలంగాణా ఎన్నికల్లో గెలవడం ద్వారా సౌత్ రాజకీయాలను ప్రభావితం చేసేంత స్థాయికి చేరుకోవాలని పార్టీ నేతలు డిసైడ్ అయ్యారు. ఇప్పటికే కర్నాటకలో అధికారంలోకి వచ్చారు. అయితే తమిళనాడులో మిత్రపక్షం డీఎంకే అధికారంలో ఉంది. కేరళలో సీపీఎం కూటమి అధికారంలో ఉంది. పాండిచ్చేరి, గోవాలో అధికారం లోదు. కాబట్టి తమిళనాడులో మిత్రపక్షాన్ని పక్కనపెట్టేసి ముందు పాండిచ్చేరి, గోవాతో పాటు కేరళలో అధికారంలోకి వచ్చే విషయమై ఆలోచిస్తున్నట్లు అర్ధమవుతోంది. పనిలోపనిగా ఇండియా కూటమిలోని మిత్రపక్షాల అభిప్రాయాలను కూడా గమనంలోకి తీసుకుని కాంగ్రెస్ ను బలోపేతం చేయడానికి పథకాలు అమలుచేయాలని అనుకున్నారు. నిజంగా ఇదికాస్త క్లిష్టమైన వ్యవహారమే అనటంలో సందేహంలేదు. మిత్రపక్షాలున్నచోట కాంగ్రెస్ బలోపేతానికి చర్చలు తీసుకుంటే మిత్రపక్షాలు ఎందుకు ఊరుకుంటాయి. మిత్రపక్షాలను నొప్పించ కుండా పార్టీని బలోపేతం చేసుకోవటం సాధ్యంకాదు. మొత్తానికి కాంగ్రెస్ సమావేశం అనుకున్నంత తేలికకాద కాంగ్రెస్ బోలోపేతం. తెలంగాణాలో బలపడాలంటే అర్ధముంది. ఎందుకంటే ఇండియా కూటమిలో తెలంగాణాలో వామపక్షాలు మినహా మరే పార్టీలేదు. వామపక్షాలు తెలంగాణాలో బలపడేది లేదు ఏమీలేదు. కాబట్టి కాంగ్రెస్ ఎంత ప్రయత్నించినా ఎవరికీ నష్టంలేదు. కొంతవరకు గోవాలో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది కాబట్టి ఇండియాకూటమి పార్టీలకు ఇబ్బందిలేదు. గోవాలో తృణమూల్ పోటీచేసినా ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. ఉత్తరాధిలో కాంగ్రెస్ బలోపేతానికి అవకాశాలు తక్కువని అగ్రనేతలకు అర్ధమైపోయింది.

అందుకనే తమిళనాడు మినహా మిగిలిన రాష్ట్రాలపై దృష్టిపెట్టింది. ఇందులో ఏపీని మైనస్ చేసేయాల్సిందే. ఎందుకంటే విభజన కారణంగా ఏపీలో కాంగ్రెస్ సమాధిస్థితిలోకి వెళ్ళిపోయింది కాబట్టి.

## సంపాదకీయం

# ఆయువు తీస్తున్న వాయువు

జీవకోటికి ప్రాణాధారం వాయువు.. అది లేనిదే మనుగడ అసాధ్యం. కానీ, అలాంటి వాయువే ఆయువు తీస్తుందట..? మీర నమ్ముతారో లేదో.. ఇది నిజం. పరిశోధనల్లో తేలిన వాస్తవం. వీటిని ఆపడం ఎలా..? అది అంత సులభం కాదని కూడా తేలింది. ఒకవిధంగా చెప్పాలంటే బలవన్మరణాలు.. ప్రజారోగ్యంలో అతి పెద్ద సమస్య అని కూడా చెప్పాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ వో) లెక్కల ప్రకారమే చూస్తే ఏటా 7 లక్షల మంది తమంతట తాము జీవితాలను చాలిస్తున్నారు. ఇందులోనూ అగ్రరాజ్యం అమెరికాదే మెజారిటీ వాటా. అంతేకాదు.. 20 ఏళ్లలలో అమెరికాలో ఆత్మహత్యల సంఖ్య 40 శాతం పెరిగిందంటే నమ్ముతారా? దీన్నిబట్టే నాగరికత ఎంత పెరుగుతోందో అంతే స్థాయిలో బలవన్మరణాలూ పెరుగుతున్నట్లు తెలియడం లేదూ..?

**ఏడాదిలోనే 50 వేలమంది? :** అమెరికా అంటే కలల రాజ్యం. డాలర్ల స్వర్గం. అంతేకాదు.. బలవనర్మణాల రాజధాని కూడా అనాలేమో? ఎందుకంటే అక్కడ నిరుడు 50 వేల మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రతి 11 నిమిషాలకు ఒకరు ప్రాణం తీసుకున్నారు. యూకేలో ఆత్మహత్యలు అమెరికా కంటే 25 శాతం తక్కువట. మరి ఈ మరణాలను తగ్గించడం ఎలా? అందుకు ఉన్న పరిష్కారం ఏమిటనే విషయాలను ఓ అధ్యయనం వెల్లడించింది. మానసిక ఆరోగ్య సంరక్షణ, ఒంటరితనాన్ని దూరం చేయడం అనే రెండు మార్గాలను సూచించింది.

**డెన్మార్క్ భేష్ :** స్కాండినేవియన్ దేశం డెన్మార్క్. అనేక ప్రమాణాలతో పాటు ఆరోగ్య ప్రమాణాల్లోనూ ఈ దేశం ముందుంటుంది. ఇలాంటి దేశంలో ఆత్మహత్య ఆలోచనలు ఉన్న వ్యక్తుల కోసం ప్రత్యేకంగా ఆత్మహత్య నిరోధక కేంద్రాల ఏర్పాటు చేసి ఫలితాలు పొందారు. బలవంతంగా తనువు చాలించాలన్న ఆలోచనలు ఉన్న వారిని ఈ కేంద్రాల్లో చేర్చి వారిలో మార్పు తెచ్చి ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనల నుంచి బయట పడేశారు. ఇది ఐదేళ్ల కిందటే చేశారు. ఇప్పుడు ఆత్మహత్యల నివారణ దిశగా సరికొత్త పరిశోధన జరుగుతోంది.

**గాలిపై పరిశోధనలు...వాయు కాలుష్యంపై :** గాలి నాణ్యత/స్వచ్ఛతకు ఆత్మహత్యలకు మధ్య ఉన్న సంబంధాన్ని పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. కొన్నేళ్లుగా పెరిగిన వాయు కాలుష్యానికి, ఆత్మహత్యలకు మధ్య సంబంధాన్ని కొన్ని అధ్యయనాల్లో గుర్తించారు. యేల్ యూనివర్సిటీకి చెందిన సీయుల్కి హియో, ఆమె కొలిగ్స్.. వాయు కాలుష్యానికి, ఆత్మహత్యలకు మధ్య ఉన్న సంబంధంపై నిర్వహించిన 18 అధ్యయనాలను సమీక్షించారు. కలప దహనం. అడవులు దగ్ధం కావడం, భవన నిర్మాణాల సమయంలో విడుదలయ్యే ధూళి, పరిశ్రమలు విడుదల చేసే వాయువులు, ఇంధనాలు మండడం వల్ల, వాహనాల నుంచి వెలువడే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ వంటి వాటి కారణంగా ఆత్మహత్యల ప్రమాదం పెరుగుతున్నట్లు వారు గుర్తించారు. లండన్‌లోని యూనివర్సిటీ కాలేజీకి చెందిన ఇసోబెల్ బ్రెయిత్‌వెయిట్ నేతృత్వంలో నిర్వహించిన పరిశోధనపై 2019లో జరిగిన సమీక్షలోనూ కొన్ని విషయాలు వెల్లడయ్యాయి.

**కాలుష్యం మూడు రోజులు మించితే..** ఈ అధ్యయనాల ప్రకారం విశ్లేషిస్తే.. వాయు కాలుష్యం మూడు రోజుల పాటు ఎక్కువగా ఉంటే ఆత్మహత్యలకు ప్రేరేపించే ఆలోచనలు పెరుగుతోంది. దీర్ఘకాలిక వాయుకాలుష్యం కుంగుబాటును పెంచే ప్రమాదం కూడా ఉంది. కాగా, దీనిపై యూరప్, ఆసియాలో అనేక అధ్యయనాలు జరిగాయి. ఇటీవల అమెరికా డేటాను విశ్లేషించినప్పుడు నగరాల్లో ఒక క్యూబిక్ మీటర్‌కు ఒక మైక్రో గ్రాము చొప్పున గాలిలో కాలుష్యకారకాలు పెరిగినప్పుడు రోజువారీ ఆత్మహత్యల రేటు 0.5 శాతం పెరిగినట్లు కేంబ్రిడ్జ్‌లోని నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ తన అధ్యయనపత్రంలో ప్రచురించింది. ఇతర అధ్యయనాల మాదిరిగా ఈ ప్రత్యేక పరిశోధన ప జీవక్రియ ఎలా ఉండొచ్చనే విషయం కచ్చితంగా తెలియదు కానీ పరిశోధకులకు మాత్రం అనుమానాలున్నాయి.

**కాలుష్యం ఎలా కారణమవుతుంది...** ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించే కాలుష్యం రక్తప్రవాహంలోకి, ఆపై మెదడుకు ఆక్సిజన్ సరఫరాను నిరోధించడం ద్వారా బలవన్మరణాలను ప్రేరేపిస్తుందని గుర్తించారు. ఇతర బలహీనతలకు కూడా దారితీస్తుందని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. కాలుష్యం మెదడులో వాపునకు దారితీయొచ్చని, అందువల్ల సెరోటోనిన్ లోటు ఏర్పడి ఒత్తిడికి గురైనప్పుడు ప్రతిస్పందించే పద్ధతులకు అంతరాయం కలిగిస్తుందని కొందరు పరిశోధకులు అనుమానిస్తున్నారు. ఇది నిరాశ, నిస్పృహలకు దారితీసే అవకాశాలను పెంచుతుంది. చెడు గాలి మనుషుల ఆలోచనలను ప్రభావితం చేయడంతో పాటు, అది మెదడును పొగమంచులా చుట్టేసి వారికి తెలియకుండానే ఆత్మహత్య ఆలోచనలను ప్రోత్సహించే అవకాశం ఉంది. సంబంధం ఉందని తెలియజేసే సారూప్యతలపైకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి పరిశోధనలోనూ ఇతర విషయాలపై ప్రభావాన్ని కూడా పరిశీలించిన తరహాలోనే ఇతర పర్యావరణ ప్రభావాలు కూడా ఉండే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న రోజుల్లో ఆత్మహత్యలు ఎక్కువగా జరిగినట్లు కనుగొన్నారు. ఉష్ణోగ్రతలు 7 సెల్సియస్ పెరిగితే, ఆత్మహత్యల రేటు 9 శాతం పెరిగిందని యేల్‌కి చెందని సహ రచయిత మిచెల్ బెల్ వివరించారు.

# ధర భారమైన యూరియా..!



మహబూబాబాద్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ అన్నదాతలకు బస్తా ధర భారమవుతోంది. ప్రస్తుతం వరి, మొక్కజొన్న పంటలకు యూరియా వేయాల్సిన అదును కావడంతో దుకాణాలకు రైతులు పరుగులు తీస్తున్నారు. వారి అవసరాన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు గరిష్ఠ ధర (ఎమ్మార్పీ) కంటే ఒక్కో బస్తాపై అదనంగా రూ.20-50 తీసుకుంటున్నారు. గత నెల రోజుల నుంచి కొందరు వ్యాపారులు అధిక ధరకు అమ్మితే మరికొందరు రైతులకు అవసరం లేని గుళికలు, బయో ఎరువులు లింకు పెట్టి విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 1.06 లక్షల టన్నుల యూరియా అవసరం పడుతుందని అధికారులు ప్రణాళిక అంచనా రూపొందించారు. దాని ప్రకారం ఇప్పటి వరకు 85 వేల టన్నులు రాగా ఇందులో 70 వేల టన్నులు విక్రయించారు. వ్యాపారులు, సహకార సంఘాలు, తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల వద్ద ఇంకా 15 వేల టన్నులు నిల్వ ఉన్నట్లు తెలిసింది. మరో 22 వేల టన్నుల యూరియా త్వరలో రానుంది.

రూ.కోట్లలో అదనపు భారంనిబంధనల ప్రకారం 45 కిలోల యూరియా బస్తాను రూ.266.50కు అమ్మాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో దిగుమతి, హమాలీ ఛార్జీలంటూ రూ.13.50 కలుపుకొని రూ.280కి అమ్ముతున్నారు. వ్యాపారులు మాత్రం బస్తాను రూ.300 నుంచి రూ.330కు విక్రయిస్తున్నారు. అదనంగా రూ.20 నుంచి రూ.50 తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఇప్పటి వరకు 70 వేల టన్నులు విక్రయించగా వాటిపై అదనంగా వసూలు చేసిన సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకుపైగా ప్రైవేటు, ఆగ్రోస్ కేంద్రాల నిర్వాహకుల జేబుల్లోకి జేబులు వెళ్లాయి. రైతులకు ఎంతకు విక్రయించారనే వివరాలతో కూడిన రశీదు కూడా వ్యాపారులు ఇవ్వడం లేదు. యూరియా బస్తాలను తీసుకెళ్తున్న ఈ రైతు చెన్నారావుపేట మండలం జల్లికి చెందిన బోడ నర్సు. ఐదెకరాల్లో మొక్కజొన్న వేశారు. పంట చేతికి వచ్చే వరకు మూడు దఫాలు యూరియా వేస్తారు. ఇందుకోసం నర్సంపేటలోని ఓ ఎరువుల దుకాణంలో మూడు యూరియా బస్తాలను తీసుకున్నారు. వ్యాపారి హమాలీ కూలీతో కలిపి ఒక్కో యూరియా బస్తాకు రూ.310 తీసుకున్నారని.. తక్కువ ధరకు అడిగితే యూరియా లేదని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనంపై రెండు యూరియా బస్తాలను తీసుకెళుతున్న ఈ రైతు కురవి మండలం పిల్లిగుంట్లతండాకు చెందిన ఆంగోతు శ్రీను. మూడెకరాల్లో వరిసాగు చేస్తున్నారు. 'మహబూబాబాద్‌లోని ఓ దుకాణంలో బస్తాకు రూ.330 అని చెబుతున్నారు.. ఇతర మందులను కొనుగోలు చేస్తే ఎమ్మార్పీ ధరకు బస్తాలు ఇస్తామన్నారు. ఇతర మందులు వద్దని వ్యాపారులు అడిగినట్లుగా మూడు బస్తాలను రూ.1000 ఇచ్చి కొనుగోలు చేశాను' అని శ్రీను విచారం వ్యక్తం చేశారు.

నియంత్రణలో అధికారుల విఫలం!నల్ల బజారులో యూరియా అమ్మకాలను అరికట్టడంలో వ్యవసాయా ధికారులు విఫలమవుతున్నారు. లోపాయికారి ఒప్పందంతోనే వ్యాపారులపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతవారం నర్సంపేటలో వ్యవసాయ అధికారులు ఓవైపు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తుండగానే మరోవైపు నెక్కొండ రోడ్డులోని ఓ వ్యాపారి బస్తాను రూ.315కు ద్వారకపేటకు చెందిన రాజు అనే రైతుకు విక్రయించారు. అధికారులు చేసిన తనిఖీల్లో ఎంత పారదర్శకత ఉందో దీన్ని బట్టి అర్థమవుతోంది. అధికారుల తనిఖీలంటే వ్యాపారుల్లో భయం లేదంటే దాని వెనక ఉన్న మతులబులేంటో బహిరంగ రహస్యమే. సాగు ఇలా..ఉమ్మడి జిల్లాలో వరి 6,48,090, మొక్కజొన్న 1,99,869 ఎకరాల్లో సాగవుతోంది. అత్యధికంగా వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో పండిస్తున్నారు. ఈ రెండు జిల్లాల్లో యూరియా అవసరం ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు ధర పెంచి విక్రయిస్తున్నారు.

# అమృత్ భారత్‌తో రైల్వేస్టేషన్‌కు మహర్దశ




జనగామ : జనగామ రైల్వేస్టేషన్‌లో దశాబ్దాలుగా మౌలిక సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత స్టేషన్‌ను అభివృద్ధి చేయాలంటూ వినతులు సమర్పించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకానికి జనగామ రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేసింది. దీంతో రైల్వేస్టేషన్‌కు మహర్దశ రానుంది. కొత్త హంగులు, సౌకర్యాలు సమకూరనున్నాయి.

రెండు దశల్లో ఉన్నతీకరణ పనులు జనగామ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకానికి ఎంపిక కావడంతో దక్షిణమధ్య రైల్వే డివిజన్ మేనేజర్(డీఆర్ఎం) అభయ్‌కుమార్‌గుప్త మంగళవారం ఈ స్టేషన్‌ను సందర్శించారు. రెండు దశల్లో స్టేషన్ ఉన్నతీకరణ పనులు చేపట్టనున్నారు. తొలి దశలో మొదటి ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం మొదటి ప్లాట్‌ఫాం వద్ద ఉన్న బుకింగ్ కౌంటర్‌ను మార్చి మరోచోట కొత్తగా నిర్మించనున్నారు. స్టేషన్ మేనేజర్ కార్యాలయాన్ని, రైల్వే పోలీస్‌స్టేషన్‌ను కొత్తగా నిర్మించనున్నారు. జనగామ పట్టణం నడిబొడ్డున రైల్వేస్టేషన్ ఉండటంతో స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న వార్డుల్లోని ప్రజలు పట్టాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తగా అంబబావి వైపు స్టేషన్ మొదటి ప్లాట్‌ఫాం బయట నుంచి రెండో ప్లాట్‌ఫాం బయటకు ఫుట్‌ఓవర్ వంతెన నిర్మించనున్నారు. దీంతో ప్రజలు పట్టాలు దాటకుండా స్టేషన్‌పై నుంచి వంతెన మీదుగా రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. స్టేషన్‌కు ప్రస్తుతం ఉన్న ప్రధాన ద్వారంతో పాటు మరో చోట కొత్త ద్వారాన్ని ఏర్పాటు చేస్తారు. ఒకటి స్టేషన్‌లోకి వెళ్లడానికి, మరొకటి స్టేషన్ నుంచి బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్ ఎదుట సుందరీకరణ పనులు, గార్డెనింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక రెండో దశలో భాగంగా రెండో ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయడంతో పాటు రెండో బుకింగ్ కౌంటర్‌ను అటువైపు ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తు అవసరాల నిమిత్తం మూడో ప్లాట్‌ఫాం నిర్మాణ పనులను కూడా రెండో దశలో చేపట్టనున్నారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకంలో జనగామ స్టేషన్‌కు చోటు లభించడంతో స్టేషన్ రూపురేఖలే మారనున్నాయి.

రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి

రైల్వే స్టేషన్‌ను అధునాతన రీతిలో పునర్నిర్మించడంతో పాటు ఎంతో కాలంగా ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్న పలు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. జనగామలో షిర్డీ, చార్మినార్, శాతవాహన, సింహపురి వంటి ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రతినిధులు కోరుతున్నారు. అలాగే సికింద్రాబాద్ నుంచి జనగామ మీదుగా కాజీపేట వరకు ఎంఎంటీఎస్ రైళ్లను నడిపితే జనగామతో పాటు ఆలేరు, భువనగిరి వంటి ప్రాంతాల ప్రజలకు రైళ్ల సౌకర్యం మరింతగా సమకూరుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ దిశగా దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రైళ్ల హాల్టింగ్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

జనగామకు వరం– హరిశ్చంద్రగుప్త, జనగామ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు

కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకాన్ని తీసుకొచ్చి అందులో జనగామకు చోటు కల్పించడం ఈ ప్రాంత ప్రయాణికులకు, వ్యాపార వర్గాలకు వరమనే చెప్పాలి. స్టేషన్ పరిసరాలన్నీ అధునాతన రీతిలో అభివృద్ధి చెందుతాయి. జనగామలో చార్మినార్, సింహపురి, షిర్డీ వంటి సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి. డీఆర్ఎంకు కూడా వినతిపత్రం అందించాం.

# వీఎల్‌టీ దందా.. మేల్కోని బల్దియా

కామారెడ్డి: కామారెడ్డి పురపాలక సంఘం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల మధ్య కొరవడిన సమన్వయం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్(వీఎల్‌టీ) పేరిట మూడేళ్లుగా లేఖరులు(డాక్యుమెంట్ రైటర్లు) బల్దియా ఆదాయానికి గండికొడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్న తీరును వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. పట్టింపు లేని పురపాలక సంఘం అధికారులు మామూలుగా తీసుకున్నారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో స్వయంగా అధికార పార్టీ కౌన్సిలర్లే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇరుశాఖల మధ్య సమన్వయం కుదిరితే వీఎల్‌టీ వసూళ్ల దందాకు తెరపడనుంది.నిబంధనల ప్రకారం నూతన పురపాలక చట్టం ప్రకారం ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమయంలో స్థలం మార్కెట్ విలువలో 0.01 శాతాన్ని వీఎల్‌టీ పేరిట కట్టి రసీదుతో పాటు ప్రత్యేక ధ్రువపత్రం తీసుకోవాల్సి ఉంటుంది.దాన్ని జతపరిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క కామారెడ్డిలో మినహా మిగతా అన్ని పురపాలక సంఘాల్లో ఇదే విధానం కొనసాగుతోంది. ప్రస్తుతం జరుగుతోందిలా..వీఎల్‌టీ ధ్రువపత్రం జారీలో పురపాలక అధికారులు తీవ్ర జాప్యం చేస్తుండడంతో రిజిస్ట్రేషన్‌శాఖ స్వీయ ధ్రువీకరణతో పూర్తి చేసేందుకు వెసులుబాటు కల్పించినట్లు ప్రచారం జరుగుతోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న లేఖరులు కొనుగోలుదారులతో స్వీయ ధ్రువీకరణ పత్రం(అఫిడవిట్) సమర్పిస్తూ ప్రక్రియ కానిచ్చేస్తున్నారు.

# పల్లె ముంగిట ప్రభుత్వ వైద్య సేవలు

కరీంనగర్ : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. మండల కేంద్రాలకే పరిమితమైన ఆసుపత్రులను మారుమూల పల్లెలకు విస్తరిస్తోంది. ఇప్పటికే ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను స్థిరీకరించి దశల వారీగా పల్లె దవాఖానాలుగా మారుస్తోంది. ఆధునిక పరికరాలు అందిస్తూ నిపుణులైన వైద్యులను నియమిస్తోంది. ఒక్కో దవాఖానా నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతోపాటు వృద్ధులకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువ అవుతోంది.

ఏడాది కిందటి వరకు మండల కేంద్రంలో పీహెచ్‌సీ, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండేవి. ఒక ఏఎన్ఎం, ఆమె కింద ఇద్దరు ఆశా కార్యకర్తలు విధులు నిర్వర్తించేవారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిగతా గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందేవి. విషజ్వరాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తితే సుదూర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆసుపత్రికి పరుగులు తీసేవారు. రోగులు, వారితో వెళ్లేవారు వ్యయప్రయాసలకు గురయ్యేవారు.

తగ్గిన రవాణా భారం, ఖర్చులు..

ప్రతి పల్లె దవాఖానాకు ఎంబీబీఎస్ వైద్యుడితోపాటు స్టాఫ్‌నర్సులను నియమించగా అప్పటికే ఉన్న ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. స్థానికంగా ఉండడంతో ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా వైద్యం పొందుతున్నారు. దూరాభారం తగ్గడంతోపాటు రవాణా ఖర్చుల భారం తప్పింది. సకాలంలో మెరుగైన సేవలు అందుతున్నాయి. గర్భిణులు, చిన్నారులకు నెలసరి సూదిమందు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో రక్త నమూనాలు సేకరించి సంబంధిత వైద్యం అందిస్తున్నారు. పలు వ్యాధులకు సంబంధించి రక్త నమూనాలను పీహెచ్‌సీల ద్వారా సేకరించి జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఉన్న తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంలో పరీక్షలు జరిపి మందులు అందజేస్తున్నారు. వివిధ రకాల వ్యాక్సిన్లు పల్లె దవాఖానాల ద్వారా అందిస్తున్నారు. ప్రతి రోజు ఒక్కో దవాఖానాలో దాదాపు 20 మందికిపైగా వైద్యం పొందుతున్నట్లు తెలుస్తోంది. అత్యవసర సమయంలో ప్రాథమిక వైద్యం అందించి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి పీహెచ్‌సీ లేదా జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రికి పంపిస్తున్నారు.

ఇప్పుడా సమస్య లేదు..జ్వరం వచ్చినా, కాళ్లు, ఒళ్లు నొప్పులు ఏ చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా ఇక్కడే వైద్యం పొందుతున్నా. అంతకుముందు గంగాధర, కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే చేతిలోని డబ్బులన్నీ ఖర్చయ్యేవి. ఏడాది నుంచి ఇప్పుడా సమస్య తీరింది. రక్తపోటు, మధుమేహం, ఇతర జబ్బులకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచన మేరకు మందులు వాడుతున్నా.

భాగ్యమ్మ, కురిక్యాల

15 రోజులకోసారి పరీక్షలు..

రక్తపోటు సమస్యతోపాటు కీళ్ల నొప్పులతో బాధ పడుతున్న. 15 రోజులకోసారి పరీక్షలు చేయించుకుని వైద్యం పొందుతున్నా. అందుబాటులో ఆసుపత్రి ఉండడంతో దూర భారం తగ్గడంతోపాటు రవాణా ఖర్చులు తప్పాయి. గతంలోనైతే ఏ చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు స్థానికంగా ఉన్న వైద్యురాలు, సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.

చంద్రవ్వ, ఉప్పరమల్యాల

దశల వారీగా విస్తరణరెండు విడతల్లో 105 పల్లె దవాఖానాలుగా ఏర్పాటు చేసి ఆరోగ్య సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం 82 మంది వైద్యులతో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. మిగత చోట్ల వైద్యులను నియమించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దశల వారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. పల్లె దవాఖానాలతో పేదలకు నాణ్యమైన సేవలు అందుతున్నాయి.

జువేరియా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

# ధర్మగుండానికి ఆధునిక హంగులు

సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ధర్మగుండానికి విశిష్టత ఉంది. ఇందులో స్నానమాచరించి రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. కొవిడ్‌తో సుమారు రెండేళ్లపాటు భక్తులను ధర్మగుండంలోకి అనుమతించలేదు. ఇటీవలే ధర్మగుండాన్ని శుభ్రం చేసి భక్తులను స్నానాలకు అనుమతిస్తున్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ పురాతన కట్టడం పరిరక్షణతోపాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో దశాబ్దాల చరిత్ర కలిగిన బన్సిలాల్‌పేట కొలను (మెట్లబావిని) శుభ్రం చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పునరుద్ధరించిన మెట్లబావిని డిసెంబరులో ప్రారంభించి సందర్శకులను అనుమతిస్తున్నారు. హైదరాబాద్ పట్టణ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. దీంతో మంత్రి కేటీఆర్ రాజన్న ఆలయంలోని ధర్మగుండం పవిత్రతను కాపాడుతూనే దర్శనానికి వచ్చే భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. దీనికోసం ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఒక ఆర్కిటెక్ సంస్థ ప్రతినిధులు, ఆలయ ఇంజినీర్లతో కలిసి ధర్మగుండాన్ని పరిశీలించారు. రెండ్రోజుల్లో నమూనాలు పూర్తికానున్నాయి. పనులకు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. కాగా నమూనాల ఎంపికపైనే నిధుల వ్యయం ఆధారపడి ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే ధర్మగుండంలో భక్తులు కొబ్బరికాయలు వేయడంతో నీరు కలుషితమవుతుందని దానిపై వల కట్టారు. ఆకర్షణీయ పనుల్లో దీనిని తొలగించాలనే ప్రతిపాదన ఉంది. దానికి ప్రత్యామ్నాయంగా ఏం చేయాలనేది సందిగ్ధం నెలకొంది.

చారిత్రక నేపథ్యం..వేములవాడలోని గుడి చెరువుగట్టుపై కొలువైన శ్రీరాజరాజేశ్వరస్వామి పూర్వం రాక్షసులకు, దేవతలకు జరిగిన ఓ సంగ్రామంలో ఇంద్రుడు రాక్షస రాజైన వృత్తాసురుడు అనే బ్రాహ్మణుడిని వధిస్తారు. దేవతల గురువైన బృహస్పతి ముల్లోకాల్లో కెల్లా ప్రసిద్ధమైన రాజరాజేశ్వరిస్వామి క్షేత్రంలోని ధర్మగుండంలో స్నానమాచరించి స్వామిని దర్శించుకుంటే బ్రహ్మహత్యాపాపం నుంచి విముక్తి లభిస్తుందని చెప్పడంతో ఇంద్రుడు ఆ విధంగా చేసినట్లు ఓ పురాణ కథనం. మహిషాసుర వధ అనంతరం దుర్గాదేవి ఇక్కడి గుండంలో స్నానమాచరించడంతో ముక్కోటి నదీ దేవతలు ఈ ధర్మగుండంలో కలిసిపోయారన్నది మరో కథనం కూడా ఉంది. త్రేతాయుగంలో వనవాసంలోని శ్రీరాముడు ఈ ప్రాంతానికి వచ్చినపుడు ఈ గుండంలో స్నానమాచరించి స్వామిని పూజించాడనీ, ఆ తర్వాత ద్వాపరయుగంలో పాండవులు కూడా ఇక్కడ పూజలు చేశారని పౌరాణిక గాథల ద్వారా తెలుస్తోంది. చరిత్రలోకి వస్తే క్రీ.శ 750-973 మధ్య కాలానికి చెందిన రాజరాజ నరేంద్ర చర్మవ్యాధులతో బాధపడుతూ ఇక్కడి ధర్మగుండంలో స్నానమాచరించడంతో వ్యాధులన్నీ నయమయ్యాయని, దాంతో ఆయన ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని చెబుతుంటారు.

# తీరనున్న ప్రయాణ కష్టాలు

మంథని: మంథని పురపాలక సంఘం పరిధిలోని బొక్కలవాగు మీదుగా రాకపోకలకు స్థానికులు పడుతున్న అవస్థలు త్వరలోనే తీరనున్నాయి. కూచ్‌రాజ్‌పల్లి వద్ద వాగుపై వంతెన నిర్మాణానికి ఈ నెల 21న శంకుస్థాపన చేయనున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది. వంతెన నిర్మాణంతో మంథని, కూచ్‌రాజ్‌పల్లి, గంగాపురి, బోయినిపేట గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీయూఎఫ్ఐడీసీ) నుంచి పట్టణ సుందరీకరణకు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో బోయినిపేట నుంచి కూచ్‌రాజ్‌పల్లి గ్రామాల మధ్య బొక్కలవాగుపై ఐబీ విశ్రాంత గృహం సమీపంలో వంతెన నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించారు. 2020లో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. సర్వే నిర్వహించి అంచనాలు తయారు చేసి సాంకేతిక అనుమతికి పంపగా ఎట్టకేలకు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మాణానికి అనుమతి లభించింది. ఈ నెల 21న శంకుస్థాపనకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బొక్కలవాగుపై వంతెన లేకపోవడంతో బోయినిపేట, కూచ్‌రాజ్‌పల్లి, గంగాపురి



గ్రామాల ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అర కిలోమీటరు దూరంలోని గ్రామాల నుంచి మంథని పట్టణం మీదుగా మూడు కిలోమీటర్ల దూరం అధికంగా ప్రయాణించాల్సి వస్తోంది. బోయినిపేట, గంగాపురి, కూచ్‌రాజ్‌పల్లి, గ్రామాలు గతంలో మంథని మేజర్ పంచాయతీ పరిధిలో ఉండేవి. ఈ గ్రామాల మధ్య ఉన్న బొక్కలవాగుపై వారధి నిర్మించడానికి పంచాయతీలో నిధులు అందుబాటులో లేకుండా పోయాయి. మంథని పురపాలక సంఘం ఏర్పడటంతో పట్టణాభివృద్ధి నిధులు మంజూరు కావడంతో వంతెన నిర్మాణానికి మార్గం సుగమమైంది. వంతెన నిర్మిస్తే మంథని పట్టణ ప్రజలకు, ఇతర గ్రామాల వాసులకు పరోక్షంగా బైపాస్ రోడ్డు సదుపాయం ఏర్పడుతుంది.

## ఆఖరినిమిషం.. అలసత్వం వద్దు!

కరీంనగర్ : వివిధ పోటీ పరీక్షల హాల్ టికెట్లలో నిర్వాహకులు నిబంధనలను స్పష్టంగా పేర్కొంటున్నారు. పరీక్షకు ఏ సమయం వరకు అనుమతి ఇస్తారు అందులో ఉంటున్నా.. పలు కారణాలతో కొంతమంది అభ్యర్థులు చివరి నిమిషంలో హడావుడిగా పరిగెత్తుకుంటూ వస్తున్నారు. నిర్ణీత సమయంలో కేంద్రంలోకి చేరుకోలేక ఇన్ని రోజుల కష్టం వృథా చేసుకుంటున్నారు. పరీక్ష రోజున హడావుడిగా పయనమవడం, ప్రయాణంలో వివిధ కారణాలతో ఆలస్యం, పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా చేరడం, కేంద్రం వివరాలు తెలుసుకోవడంలో జాప్యంతో సమయం దాటిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థులు అధికారులను వేడుకున్నా ఫలితం ఉండటం లేదు. ప్రతి పరీక్ష సమయంలో కొంతమంది వెనుదిరగడం ఆన్‌లైన్ పరీక్ష విధానంలో అరగంట ముందుగా చేరుకోకుంటే ఫలితంగా ఎన్నో ఆశలతో పరీక్ష రాసేందుకు వెళుతున్న అభ్యర్థులు చాల మంది నిర్వేదంతో పరీక్ష రాయకుండానే వెనుదిరగడం ప్రతిసారీ పరిపాటిగా మారింది.

నిద్ర తగ్గించుకుని.. సరదా కబుర్లను పక్కన పెట్టి.. ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు శ్రమిస్తున్నారు.. ఉన్న ఊరు, కుటుంబాలకు దూరంగా ఉంటూ ఉద్యోగావకాశాలకు అర్హత సాధించడమే ధ్యేయంగా పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.. వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగ అర్హత పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు తుది అంకమైన పరీక్ష సమయానికి చేరుకోవడంలో కొంత అలసత్వం వహించి శ్రమను వృథా చేసుకుంటున్నారు.. పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమవుతున్నవారు పరీక్ష రోజున ప్రణాళికను మరుస్తున్నారు.. పరీక్ష సమయానికి చేరుకోగా హాజరుకు అనుమతి ఇవ్వకపోవడంతో దిగాలుగా వెనుదిరుగుతున్నారు.. ఇటీవల పోటీ పరీక్షలు, ఉద్యోగ అర్హత పరీక్ష కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంటోంది. గురువారం జూనియర్ లెక్చరర్ల (జేఎల్) నియామక పరీక్ష కేంద్రాల వద్ద ఇదే పరిస్థితి తలెత్తింది. శుక్రవారం కరీంనగర్‌లో టెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకుని తమ ఆశయ సాధనలో చివరి దశ అయిన పరీక్షను విజయవంతంగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలి.

అప్రమత్తతే ప్రధానంపరీక్ష జరిగే ముందు రోజు కేంద్రాలకు దగ్గరలో ఉన్నవారు వాటిని సందర్శించాలి. మిగిలిన వారు కేంద్రాలకు సంబంధించిన పూర్తి చిరునామాను తెలుసుకోవాలి.

పరీక్ష కేంద్రానికి అనుమతించే సమయం కన్నా కనీసం గంట ముందుగా చేరుకునేలా సిద్ధం కావాలి. ఇందుకు అనుగుణంగా ప్రయాణ సౌకర్యం వివరాలు, రూట్ మ్యాప్, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల సౌకర్యాలను కూడా ముందుగానే తెలుసుకుని ప్రయాణాన్ని ప్రారంభించాలి. దూరాన్ని అంచనా వేసి నిర్ణీత సమయంలో వెళ్లొచ్చు అని ఆలస్యం చేస్తే ప్రయాణం మధ్యలో ఏవైనా అవాంతరాలు ఎదురైతే ఇబ్బందులు ఎదురవడం ఖాయం.

పరీక్ష కేంద్రాల వరకు ప్రయాణ సౌకర్యం ఉందో లేదో ముందుగానే తెలుసుకుని అందుకు అనుగుణంగా ఏర్పాట్లుచేసుకోవాలి.

ఒకే పేరుతో గల విద్యా సంస్థల బ్రాంచీలు ఒకటికి మించి ఉంటున్నందున పరీక్ష కేంద్రం గల బ్రాంచి వివరాలు, చిరునామాను ముందస్తుగానే తెలుసుకోవాలి.

విద్యా సంస్థ పేరు తెలుసు కదా అని కేంద్రానికి వెళ్లిన తరవాత కూడా ఆలస్యం చేయకుండా.. తమకు కేటాయించిన బ్లాక్ ఎక్కడో తెలుసుకోవాలి. ఇందుకు అక్కడ ఉండే సంస్థ సిబ్బంది సాయం తీసుకోవాలి.

అభ్యర్థులు నివసించే ప్రాంతాలకు చాలా దూరంగా పరీక్ష కేంద్రం ఉన్న ప్రాంతం ఉంటే ముందు రోజే సమీపంలో అనువైన చోట బస చేస్తే ప్రయోజనం.

హాజరుకు కూడా ప్రణాళిక అవసరం

– జనార్దన్‌రావు, డీఈవో, టెట్ మెంబర్ కన్వీనర్, కరీంనగర్

ఉద్యోగాల కోసం అభ్యర్థులు సన్నద్ధమవడం ఒక ఎత్తైతే పరీక్షకు హాజరవడానికి ప్రణాళిక కూడా ప్రధానమే. అభ్యర్థులు కేంద్రాల వివరాలను ముందుగానే తెలుసుకోవాలి, కొత్త ప్రాంతమైతే ముందే వెళ్లి చూసి రావాలి. పరీక్ష సమయానికి చేరుకునేలా ముందు రోజే కార్యాచరణ చేసుకోవాలి. కేంద్రాలకు గంట ముందే చేరుకుంటే ప్రశాంతంగా పరీక్ష రాస్తారు.

# మన ఊరు–మన బడి.. పనులు తడబడి



వరంగల్ :సర్కార్ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికోసం ఫిబ్రవరి–2022లో ప్రతిపాదనలు రూపొందించారు. ఏప్రిల్‌లో పాఠశాలల ఎంపిక పూర్తి చేశారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేయాలని కార్యాచరణ రూపొందించారు. కొన్నిచోట్ల మాత్రమే పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర కావస్తున్నా కొన్నిచోట్ల మాత్రమే పూర్తై విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. గుత్తేదారులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయి.

60 శాతం పనులే..

పేరు : ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అశోక్‌నగర్ (ఖానాపురం)

విద్యార్థులు : 120

కేటాయించిన నిధులు : రూ.35 లక్షలు

చేయాల్సిన పనులు : వంటగది, భోజనశాల, ప్రహరి నిర్మాణం, గదుల్లో బండపరుపు, విద్యుత్తు, తాగునీరు, మూత్రశాలల ఏర్పాటు

గడువు : జులై 31

ప్రస్తుత పరిస్థితి : గదుల్లో బండలు పరిచారు. ప్రహరీ నిర్మాణం కొనసాగుతోంది. వంటగది, భోజనశాల పనులు ప్రారంభం అయ్యాయి. 60 శాతం పనులే జరిగాయి. బిల్లులు రాకనే పనులు జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఇతర అంశాలు : పనులు వేసవిలో చేయాల్సి ఉండగా పాఠశాల బోధనా సమయంలో జరుగుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆటస్థలం బురదగా ఉంది.

జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఇల్లంద

146

రూ.42 లక్షలు

మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం, రంగులు వేయడం, తరగతి గదులకు మార్గం, వంట గది, డైనింగ్ హాల్ నిర్మాణం, విద్యుత్తు మరమ్మతు పనులు.

జులై 31, 2023

డైనింగ్ హాల్, ముందువైపు ప్రహరీ, వంటగది పూరయ్యాయి. రంగులు సగం వరకు వేశారు. వెనుకవైపు ప్రహరీ, మరుగుదొడ్లు, చేతులు శుభ్రం చేసుకునే పనులు, ర్యాంపుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణ అధ్వానంగా ఉంది. పాఠశాల వెనుక వైపు ప్రహరీ కూలిపోవడంతో పశువులు వస్తున్నాయి. శుద్ధజల యంత్రం పనిచేయడం లేదు.

రూ.30 లక్షలలోపు పనులు ఎస్ఎంసీకి..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 645 ఉండగా.. మొదటి విడతలో 223 ఎంపిక చేశారు. వాటికి రూ.88.54 కోట్లు కేటాయించారు. అందులో రూ.24.22 కోట్ల పనులను మాత్రమే పూర్తి చేశారు. మిగతా నిధులను ప్రభుత్వం మంజూరు చేయలేదు. మౌలిక వసతుల కల్పనకు రూ.30 లక్షలలోపు ఉన్న పనులకు పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లకు అప్పగించారు. అంతకు మించి వ్యయానికి సంబంధించిన పనులకు గుత్తేదారులకు ఇచ్చారు.

టెండర్లకే దిక్కులేదు..

ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కృష్ణాకాలని, వరంగల్ స్టేషన్‌రోడ్డు

432

రూ.3.14 కోట్లు

పాత గదులు కూల్చేసి కొత్తవి నిర్మాణం, తాగునీరు, విద్యుత్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు తదితర మరమ్మతులు

జూన్

అసలు టెండర్లే కాలేదు. నిధులు వృథాగా ఉన్నాయి. పాత గదుల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షమొస్తే పాఠశాల వెనుక ఉన్న డ్రైనేజీ నీళ్లన్నీ ఆవరణలోకి వస్తున్నాయి. విద్యార్థులు మోకాలిలోతు నీటిలో నుంచే రావాల్సి వస్తోంది. గుత్తేదారులు పనులు చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదని స్థానిక కార్పొరేటర్ అనిల్ తెలిపారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు..

గురిజాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు (ఒకే ఆవరణ)

280

రూ.1.78 లక్షలు ఉన్నత

ఉన్నత పాఠశాలలో నాలుగు గదులు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ప్రాథమిక పాఠశాలలో 8గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతిఉన్నత పాఠశాల గడువు ముగిసి నాలుగు నెలలైంది. ప్రాథమిక పాఠశాలలో జూన్ 1న పనులు ప్రారంభించారు.

ఉన్నత పాఠశాలలో గదులు నిర్మించారు. బండల పరుపు, రంగులు, విద్యుత్తు పనులు మిగిలి ఉన్నాయి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శిథిలావస్థకు చేరిన ఉన్నత పాఠశాల గదుల్లో, ఆరుబయట పాఠాలు వింటున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా భారీ వాహనాలు వస్తుండటంతో ఆవరణమంతా బురదమయంగా మారింది.

పనుల్లో నాసిరకం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు నేలపైనే దుమ్ములో కూర్చుంటున్నారు. ప్రాంగణమంతా బురదగా ఉండటంతో నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.. – డి.వాసంతి, డీఈవో

ఎంపిక చేసిన పాఠశాలల్లో కొన్నింటిలో పనులు జరుగుతున్నాయి. మరికొన్నిచోట్ల నిధులు రాకపోవడంతో గుత్తేదారులు ఆపేశారు. ఎస్ఎంసీలకు అప్పగించిన పనులు సజావుగా సాగుతున్నాయి. పనుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నాం.

# ఆక్రముంచుతున్నారు!

జయశంకర్ : జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. భూపాలపల్లి, కాటారం, గణపురం, మహదేవపూర్, తదితర ప్రాంతాల్లో ఈ దందా సాగుతోంది. అసైన్డ్ భూములతో పాటు, చెరువు శిఖం భూముల్లోనూ నిర్మాణాలు చేపడుతున్నారు. కాటారం మండలంలో పెద్దఎత్తున నిర్మాణాలు సాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు గంగారం క్రాస్ రోడ్డు, మేడిపల్లి గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఐదు మండలాలకు కూడలిగా ఉన్న కాటారంలో 353సీ జాతీయ రహదారి నుంచి వెళ్తుండటంతో భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో అక్రమార్కుల కన్ను మండల కేంద్రంలో ప్రధాన రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ, అసైన్డ్, చెరువు శిఖం భూములపై పడింది. వాటినే అమాయకులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. భూపాలపల్లి, మేడారం, గోదావరిఖని రహదారి వెంట నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆ ప్రాంతాల్లో పట్టా భూములతో పాటు.. ఎక్కువగా అసైన్డ్, చెరువు శిఖం భూములు ఉన్నాయి. వీటిని క్రయ విక్రయాలకు, వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు వీలుండదు. నిబంధన పెడచెవినపెట్టి క్రయవిక్రయాలు జరుపుతున్నారు.

ఇవిగో తార్కాణాలు

కాటారం మండలం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సమీపంలోని అసైన్డ్ భూమిలో ఓ భవనం నిర్మాణం అవుతోందని స్థానికుల ఫిర్యాదుతో పనులు నిలిపివేశారు. కొన్ని రోజుల అనంతరం యథావిధిగా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

కాటారం మండల తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో, మేడారం వెళ్లే రహదారి వెంట ప్రభుత్వ అసైన్డ్ భూములున్నాయి. వాటిని ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయాలు చేపడుతున్నారు. అవి అసైన్డ్ భూములని తెలియక అమాయకులు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

భూపాలపల్లి పట్టణంలో ప్రధాన రహదారి పక్కన సర్వే నంబరు 170లో భూములను కొందరు కబ్జా చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు.. రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారు.

భూపాలపల్లిలో జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 218, 219లోని ప్రభుత్వ సీలింగ్ భూముల్లో సుమారు 10 గుంటల వరకు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది.

జిల్లా కేంద్రానికి ఆనుకుని గణపురం మండలం చెల్పూరు శివారులోని సర్వే నంబరు 91లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా పట్టా పొందారు. దర్జాగా గుంటల చొప్పున విక్రయిస్తున్నారు.

భూపాలపల్లి పట్టణంలో జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 141లో 2.20 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా కొందరు తప్పుడు రెవెన్యూ కాగితాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలిసింది.

మహదేవ్‌పూర్ మండలం కేంద్రంలోని సర్వే నంబరు 600లో



పంచరాయి భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆక్రమించుకున్న వారు నిర్మాణాలు చేపడుతున్నారు.

నోటీసులతోనే సరి..

ఆక్రమించిన, కొనుగోలు చేసిన భూముల్ల పంచాయతీల అనుమతి లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పంచాయతీ, రెవెన్యూ అధికారులు వెళ్లి అడ్డుకొని నోటీసులు ఇస్తున్నారు. ఆ తర్వాత కొన్నాళ్లు స్తబ్దుగా ఉండి తిరిగి పనులు జరిపిస్తున్నారు సెలవు రోజుల్లో పనులు చేస్తున్నారు. ఇల్లు పూర్తి చేస్తే చర్యలకు అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వ భూములని తెలియక భూములు కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, నేతల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు మాత్రం రాజకీయ పలుకుబడితో నిర్మాణాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు.

అనుమతి లేకుండానే వెంచర్లు

వ్యవసాయ భూములు సైతం అనుమతులు లేకుండానే ఏంచక్కా రియల్ వెంచర్లుగా మారుతున్నాయి. లేఅవుట్ నిబంధనలను అనుసరించకుండానే అడ్డగోలుగా వెలుస్తున్న వెంచర్లతో భవిష్యత్‌లో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నా ఇబ్బందులకు గురికాక తప్పదు. కొన్నిచోట్ల డీటీసీపీ అనుమతి లేకుండానే రెండు ఎకరాలకు పైబడి వెంచర్లు వేస్తున్నారు. కాగితాల్లో మాత్రం రెండెకరాల్లోపు పేర్కొంటూ సంబంధిత పంచాయతీల అనుమతులు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.

హద్దులు గుర్తిస్తే..

ప్రభుత్వ, శిఖం భూములను గుర్తించి, సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేస్తే ఆక్రమణలు ఆపే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అన్యాక్రాంతం అవుతున్నాయి. రూ.లక్షల విలువ చేసే భూములను రక్షించాలని, శాశ్వత పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ చేపడతాం –రమాదేవి, ఆర్డీవో భూపాలపల్లి

అసైన్డ్, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. మా దృష్టికి వచ్చిన వాటిని అడ్డుకుంటున్నాం. ఆక్రమణలపై విచారణ చేయిస్తాం. ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటాం.

# ఇంజినీర్ల కృషి.. భవితకు దిక్సూచి

మిర్యాలగూడ : ఒక ప్రాంతం ఏ రంగంలో అభివృద్ధి సాధించాలన్నా ఇంజినీర్ల పాత్ర కీలకం. ప్రపంచంలో అత్యధిక ఇంజినీర్లు ఉన్న దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంటుంది. దేశంలో ఏటా లక్షలాది మంది ఇంజినీర్లు తయారవుతున్నారు. భారత ఇంజినీరింగ్ పితామహుడిగా పేరుగాంచిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలకు గుర్తుగా.. ఇంజినీర్స్ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని యువ ఇంజినీర్లపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి శాఖలో ప్రస్తుతం యువ ఇంజినీర్లే అధికంగా ఉన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనుల విజయవంతంలో ఇంజినీర్ల పాత్ర అమోఘం. రహదారుల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణంలోనూ ఇంజినీర్ల పని తీరుతోనే పూర్తయ్యాయి. ఇక ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే నిరంతర విద్యుత్తు అందించడంలోనూ యువ ఇంజినీర్ల సేవలు మరువలేనివి.

ఐఐటీ భువనేశ్వర్‌లో చదివా

రమావత్ రాంబాబు, ఏఈఈ, ఆర్ అండ్ బీ శాఖ, మిర్యాలగూడ



నేను ఐఐటీ భువనేశ్వర్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే సివిల్ ఇంజినీరింగ్ చదివి..ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. ప్రాంత అభివృద్ధికి సూచికలుగా నిలిచే రహదారుల నిర్మాణంలో నేను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. ప్రజల ఇబ్బందులకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు చేయించడం ఆనందంగా ఉంది.

రోజంతా నీటి నాణ్యత పరిశీలిస్తున్నా

కొమరాజు నాగ మణికంఠన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, మోతె

మాది తిప్పర్తి మండలం గడ్డికొండారం. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో 2016లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. 2018లో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం సాధించాను. గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందించడంలో కీలక పాత్ర పోషించడం సంతోషంగా ఉంది. ప్రతి రోజు అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా, నీటి నాణ్యత పరిశీలించడం వంటి పనులు చేస్తుంటాం.

సమస్యలు లేకుండా విద్యుత్తు సరఫరాలో నిమగ్నం

ఉప్పుల హరీష్, విద్యుత్తు ఏఈ, మట్టపల్లి

మాది సూర్యాపేట జిల్లా మునగాల. కోదాడలో పాఠశాల విద్య, జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో 2014లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. అనంతరం 2016లో నల్గొండలో విజిలెన్స్ విభాగంలో ఏఈగా చేరాను. ఏడాది నుంచి మట్టపల్లిలో ఏఈగా పని చేస్తున్నాను. ప్రజలు ఇబ్బందులు పడకుండా.. వారు సమస్యల పరిష్కారం కోసం మా వద్దకు వస్తే తక్షణమే స్పందించి పరిష్కరిస్తుంటాం. మా ప్రాంతంలో ఓ వైపు వ్యవసాయానికి, మరో వైపు పరిశ్రమలకు ఎటువంటి సమస్యలు లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తున్నాం.

అవిశ్రాంతంగా శ్రమించాం

2010లో గ్రామీణ నీటి విభాగంలో ఇంజనీర్‌గా చేరాను. మిషన్ భగీరథ పైలాన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ చౌటుప్పల్‌లో ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టు ఇంట్రా విభాగం డీఈగా 2015 నుంచి విధులు నిర్వహిస్తున్నాను. ఫ్లోరిన్ విషపు నీళ్ల నుంచి విముక్తి కల్గించే ప్రాజెక్టులో మా డివిజన్ పరిధిలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రామన్నపేట మండలాల పరిధిలో 54,689 ఇళ్లలో రెండున్నర లక్షల జనాభా ఉండేది. ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందించడం మా పని. మూడేళ్ల పాటు అవిశ్రాంతంగా ఇంజనీర్లమంతా శ్రమించాం. మాకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాం. ఫ్లోరిన్ నీళ్లకు బదులు నల్లాల్లో స్వచ్ఛమైన మంచినీరు అందించే ప్రాజెక్టులో కృషి చేయడం జీవితంలో మరువలేని జ్ఞాపకం. తెలంగాణ దశాబ్ది 'మంచినీళ్ల ఉత్సవం'లో ఇంజనీర్‌గా నాకు ప్రశంసాపత్రం అందించి సత్కరించినందుకు సంతోషంగా ఉంది.

గొప్ప ప్రాజెక్టులో భాగస్వామినయ్యా..

మిషన్ భగీరథ ప్రాజెక్టులో చౌటుప్పల్ గ్రిడ్ డీఈగా పని చేసేందుకు వచ్చాను. నాగార్జునసాగర్ నుంచి కృష్ణా నది నీటిని కోదండాపురం వద్ద తీసుకుని ఆ నీళ్లను నాంపల్లి మండలం స్వాములవారి లింగోటంలోని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో రోజుకు 7లక్షల లీటర్లు శుద్ధి చేసి ఆరు మండలాల్లోని 600 గ్రామాలకు అందించాలనేది నా పరిధిలో లక్ష్యంగా నిర్దేశించారు. ఫ్లోరిన్ పీడిత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకోసం సహ ఇంజనీర్లతో కలిసి మూడేళ్లు దీక్షతో పని చేశాం. రోజూ 7 కోట్ల లీటర్ల నీళ్లను 110 కిలోమీటర్ల దూరం చేరుస్తున్నాం. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం శుద్ధి చేసిన స్వచ్ఛమైన నీటిని నల్లాల్లో ఇంటింటికీ సరఫరా చేయడంతో ఫ్లోరిన్ నుంచి విముక్తి లభించింది. కొత్తగా ఫ్లోరోసిస్ కేసులు నమోదు కాలేదని ప్రభుత్వం ప్రకటించింది. లక్షల మందికి మంచినీళ్లు అందించే మిషన్ భగీరథ ప్రాజెక్టులో పని చేసే అవకాశం వచ్చినందుకు ఇంజనీర్‌గా సంతోషిస్తున్నాను.రవి,డీఈ మిషన్ భగీరథ, వాటర్ గ్రిడ్ విభాగం

## వైకుంఠధామాలకు సౌర వెలుగులు

నల్గొండ : ఆదాయం తక్కువగా ఉన్న చిన్న పంచాయతీలు విద్యుత్తు బిల్లులు చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. వచ్చే నిధులు రోజు వారి కార్యకలాపాలకే సరిపోవడం లేదు. వైకుంఠధామాలు నిర్మించి ఏళు గడుస్తున్నా విద్యుత్తు సౌకర్యం లేదు. రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయి. విద్యుత్తు కనెక్షన్ ఇచ్చుకోలేని 31 మండలాల్లో 360 పంచాయతీల పరిధిలో శ్మశాన వాటికల్లో సౌర వెలుగులు నింపేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉండగా దాదాపు అన్నింటా వైకుంఠధామాల నిర్మాణం పూర్తయింది. ఇప్పటి వరకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వని వైకుంఠధామాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో స్తంభాల ఏర్పాటు పంచాయతీలకు భారంగా మారింది. సర్పంచులు పలుమార్లు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లాలో 360 వైకుంఠధామాల్లో సౌర దీపాలు ఏర్పాటు చేశారు. ఒక్కో శ్మశానవాటికకు రూ.7,280 చొప్పున ఖర్చు చేశారు.నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..–శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో, నల్గొండఆదాయం తక్కువగా ఉన్న చిన్న పంచాయతీల శ్మశాన వాటికల్లో సౌరదీపాలు ఏర్పాటుకు జిల్లా పంచాయతీ అధికారి వివరాలు అడిగారు. ఆ మేరకు వివరాలు పంపాం. వెంటనే వాటిలో సౌర దీపాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ గ్రామ పంచాయతీలు చూసుకోవాలి.

# మనబడికి నిధుల కొరత

ములుగు : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'మన ఊరు మన బడి' కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమం కింద పాఠశాలల మరమ్మతులు, నూతన నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, నిధుల కొరతతో జిల్లాలో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రూ.30 లక్షల లోపున్న పనులను పాఠశాల యాజమాన్య కమిటీలు చేస్తుండగా, ఆపైన వాటిని టెండరు ద్వారా గుత్తేదారులకు అప్పగించారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో.. గుత్తేదారులు పనులు నిలిపివేశారు. మే చివరి నాటికి పనులు పూర్తి చేయాలని గడువు విధించినా.. పనులు పూర్తి కాలేదు. జిల్లాలోని పనులను గురువారం బృందం పరిశీలించింది.

రూ.3 కోట్ల బకాయిలు

మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులకు నిధుల కొరత ఏర్పడింది. ఐదు నెలలుగా బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నారు. త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు గుత్తేదారులు, పాఠశాల యాజమాన్య కమిటీలపై ఒత్తిడి పెంచినా.. బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలోనే ఆపేశారు. వచ్చేది ఎన్నికల సీజన్.. రూ.లక్షలు వెచ్చించి పనులు చేస్తే బిల్లులు వస్తాయో లేదోననే సందేహంతో గుత్తేదార్లు వెనకంజ వేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ.3 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

125 పాఠశాలల ఎంపిక

జిల్లాలో మొత్తం 348 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. మొదటి విడతలో జిల్లాలో 125 బడులను ప్రభుత్వం ఎంపిక చేసింది. మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం మొదలగు పనులు చేస్తున్నారు. ఇందులో 77 ప్రాథమిక, 17 ప్రాథమికోన్నత, 33 ఉన్నత పాఠశాలలున్నాయి.

అసంపూర్తిగా పనులు

పాఠశాల పేరు: ప్రాథమిక పాఠశాల, ములుగు
విద్యార్థులు: 60 మంది
కేటాయించిన నిధులు: రూ.29 లక్షలు
చేయాల్సిన పనులు: విద్యుత్తు, గది నిర్మాణం, హాండ్ వాష్ ప్లాట్‌ఫాం, టాయిలెట్లు, చిన్న చిన్న తదితర పనులు
ప్రస్తుత పరిస్థితి: పాఠశాలలో కరెంటు పని అసంపూర్తిగా ఉంది. గది నిర్మాణం పూర్తయినా.. దానికి రంగులు వేయలేదు. హాండ్‌వాష్ ప్లాట్‌ఫాం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. టాయిలెట్లు నిర్మాణం జరగలేదు.ఇతర అంశాలు: వరండాలో కూర్చుంటున్నారు. అసంపూర్తి పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

పనుల వివరాలు..
మంజూరైన మొత్తం పాఠశాలలు: 125
కేటాయించిన మొత్తం రూ.26.40 కోట్లు
పనులు పూర్తయిన బడులు : 69
ఇప్పటి వరకు చెల్లించినది: రూ.16.25 కోట్లు
చెల్లించాల్సిన బకాయిలు: రూ.3 కోట్లు
ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు: రూ.10.40కోట్లు

కిటికీలు లేకుండా.. రంగులు వేయకుండా..
తిమ్మంపేట ప్రాథమిక పాఠశాల, మంగపేట మండలం
112 రూ.22 లక్షలు
భవన నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్తు
పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రంగులు వేయలేదు. కిటికీలు బిగించలేదు.
వర్షాకాలంలో విషపురుగులు సంచరించే అవకాశం ఉంది. కిటికీలు బిగిస్తేను విద్యార్థులకు భద్రత. – న్యూస్‌టుడే, తిమ్మంపేట(మంగపేట)

కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం
రంగరాజపురం ప్రాథమిక పాఠశాల, వెంకటాపురం మండలం
122 మంది
రూ.59.84 లక్షలు
డైనింగ్ హాల్, రెండు అదనపు తరగతి గదుల భవనం

అదనపు తరగతి గదుల నిర్మాణం కొనసాగుతోంది. లింటల్ స్థాయి దశలోనే పనులు మూలుగుతున్నాయి. డైనింగ్‌హాల్ పనులు చివరిదశకు చేరాయి. పూర్వపు భవనాల ఆధునికీకరణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కిచెన్‌షెడ్ పనులకు మోక్షం లేదు. మరుగుదొడ్ల పనులు అసంపూర్తిగానే వెక్కిరిస్తున్నాయి.

ఐదు తరగతులకు కేవలం రెండు గదులు ఉండటంతో.. వరండాలోనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి. కిచెన్ షెడ్ లేక మధ్యాహ్న భోజనం బయట తయారు చేస్తున్నారు. వేగం పెంచితేనే విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి. చర్యలు తీసుకుంటున్నాం.. పాణిని, డీఈవో, ములుగు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. వర్షాల కారణంగా కొంత ఆలస్యమైంది. పనులు వేగవంతం చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

# వైద్య విద్యకు సర్వం సిద్ధం

భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లాలో నిర్మించిన వైద్య కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించ నున్నారు. వైద్య కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందనుంది. ప్రస్తుతం ఉన్న జిల్లా ఆసుపత్రిలో పడకల సామ ర్థ్యాన్ని పెంచుతారు. మరో ఆసుపత్రిని నిర్మించనున్నారు. వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం వంద ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేశారు. ఇందులో 85 శాతం రాష్ట్ర విద్యార్థులకు, 15 శాతం సీట్లు ఆల్ ఇండియా(నేషనల్) కోటాకు కేటాయించారు. ఇప్పటికే 100 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వైద్య కళాశాల, ఆసుపత్రి, అనుబంధ నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.168 కోట్లను మంజూరు చేసింది. సింగరేణి వెయ్యి క్వార్టర్ల సమీపంలో 22 ఎకరాల స్థలాన్ని అధికారులు ఎంపిక చేశారు. ప్రస్తుతం అందులో కళాశాల భవన నిర్మాణం చేపడుతున్నారు. మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు కావాల్సిన మూడు విభాగాల పనులను పూర్తిచేసి కళాశాల నిర్వహణకు అప్పగించారు. విద్యార్థులకు వసతి సౌకర్యార్థం వైద్య కళాశాలకు అత్యంత సమీపంలోని సింగరేణి సంస్థకు చెందిన రామప్ప కాలనీ క్వార్టర్లలో గదులను కేటాయించారు. మెస్ సౌకర్యం కూడా కల్పించనున్నారు. ఎన్‌సీఎం నిబంధనల ప్రకారం సెప్టెంబర్ మొదటి వారం నుంచే తరగతులు ప్రారంభించాల్సి ఉన్నా విద్యార్థుల కౌన్సెలింగ్‌తో కాస్త ఆలస్యమవుతోందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరలోనే తరగతులు ప్రారంభిస్తామని అధ్యాపకులు తెలుపుతున్నారు. శిక్షణ కోసం కళాశాలకు అనుబంధంగా జిల్లా ఆసుపత్రి, సింగరేణి ఆసుపత్రిని వినియోగించుకుంటారు. ప్రస్తుతం ప్రిన్సిపల్, ముగ్గురు ప్రొఫెసర్లు, ఏడుగురు అసోసియేట్, 20 మంది సహాయక ప్రొఫెసర్ల నియామకం జరిగింది. మొత్తం సుమారు 62 పోస్టులకు 30 మంది నియామకం జరిగింది. రెండో సంవత్సరానికి కల్లా దశల వారీగా బోధనా సిబ్బంది నియామకం చేపట్టనున్నారు. ప్రిన్సిపల్ రాజు దేవ్‌డే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉదయం 12 గంటలకు వర్చువల్ పద్ధతిలో వైద్య కళాశాలను ప్రారంభించనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేశాం. ఇక్కడి కళాశాలలో అన్ని సౌకర్యాలతో తరగతులను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



# సీతక్క కుమారుడు పోటీ అక్కడి నుంచేనా?

సీతక్క.. పరిచయం అక్కర్లేని పేరు. మాజీ మావోయిస్టుగా, గిరిజన ప్రతినిధిగా ఆమెకు ఎంతో గుర్తింపు ఉంది. మరోవైపు ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ములుగు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. కరోనా సమయంలో, గోదావరి వరదలప్పుడు సీతక్క ఆ కొండ కోనల్లో, కాలి బాటలు కూడా లేని దారుల్లో ప్రజలకు విశేష సేవలు అందించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ముఖ్య పాత్ర పోషిస్తున్న సీతక్క వచ్చే ఎన్నికల్లోనూ ములుగు నుంచి పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ మేరకు ఆమెకు దాదాపు సీటు ఖాయమైనట్టే. కాగా మరోవైపు ములుగులో సీతక్కపై పోటీకి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో ఎస్టీ మహిళనే బరిలోకి దింపారు. ప్రస్తుతం ములుగు జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా ఉన్న బడే నాగజ్యోతిని బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారు చేశారు. అయితే సీతక్కను ఓడించడం చాలా కష్టమనే విషయం కేసీఆర్ కు తెలుసు. ఎందుకంటే ములుగులో సీతక్క చేసిన సేవలు అటువంటివి. ఇప్పటివరకు ప్రభుత్వం, అధికారులు కూడా వెళ్లలేని కుగ్రామాలకు సైతం సీతక్క వెళ్లగలరు. మావోయిస్టు ఉద్యమంలో ఆమె పనిచేసి ఉండటంతో అడవిలో ప్రతి బాట, దారి ఆమెకు అవగతమే. ఈ క్రమంలోనే గోదావరి వరదలు ములుగు నియోజకవర్గంలో గ్రామాలను చుట్టుముట్టినప్పుడు, ప్రజలు విష జ్వరాల బారినపడ్డప్పుడు, కరోనా సమయంలోనూ సీతక్క విశేష సేవలు అందించారు. స్వయంగా నిత్యావసర వస్తువులను తన తలపై పెట్టుకుని నడుచుకుంటూ మోసుకుపోయారు. అలాగే నిండు గోదావరిలో పడవపై ఎలాంటి బెరుకు, భయం లేకుండా ప్రయాణించి ప్రజలకు అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో మరోమారు సీతక్క విజయం ఖాయంగానే కనిపిస్తోందని అంటున్నారు. ఈ క్రమంలో ఈసారి ఎలాగైనా సీతక్కను ఓడించడానికి కేసీఆర్ చాలా పెద్ద ఎత్తునే కసరత్తు చేశారు. చందూలాల్ లాంటి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ చివరకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బడే నాగజ్యోతిని అభ్యర్థిగా ప్రకటించారు. కాగా సీతక్క కుమారుడిని కూడా కాంగ్రెస్ ఎన్నికల బరిలో నిలుపుతుందనే వార్తలు వస్తున్నాయి. ప్రజాసేవ చేయడానికి సీతక్క తన కుమారుడు సూర్యను గతంలోనే రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. సూర్య ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని పినపాక అసెంబ్లీ నియోజకవర్గంలో చురుగ్గా పర్యటిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి పీసీసీకి తాజాగా దరఖాస్తు కూడా చేసుకోవడం విశేషం. అటు కాంగ్రెస్ అధిష్టానం, ఇటు తెలంగాణ సీనియర్ నేతలు కూడా సూర్య అభ్యర్థిత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు టాక్ నడుస్తోంది. పినపాక సీటుపై దృష్టి సారించిన సీతక్క కుమారుడు సూర్య గత కొన్ని నెలలుగా పినపాకలోనే తిష్టవేశారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. నిత్యం జనాల్లో తిరుగుతున్నారు. రోజుకో మండలాన్ని ఎంచుకుని గ్రామాల్లో పర్యటిస్తున్నారు. కాగా ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన పినపాకలో 2018 ఎన్నికల్లో రేగా కాంతారావు కాంగ్రెస్ తరఫున పోటీచేసి.. బీఆర్ఎస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుపై 19,565 ఓట్ల తేడాతో గెలిచారు. అయితే.. కాంగ్రెస్ కు రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరిపోయారు. రేగా కాంతారావు బీఆర్ఎస్ లో చేరిపోవడంతో పినపాక కాంగ్రెస్ కార్యకర్తలకు.. ప్రజలకు సీతక్క కుమారుడు సూర్య అండగా నిలుస్తూ వస్తున్నారు.అందులోనూ యువకుడు కావడంతో యూత్ లో మంచి ఫాలోయింగ్ తెచ్చుకున్నారు. సూర్యను కచ్చితంగా గెలిపించుకుంటామని.. ప్రజా సమస్యలను పరిష్కరించే నేత కావాలని అక్కడి ప్రజలు కూడా కోరుతున్నారు. దీంతో ములుగులో తల్లి సీతక్క పినపాకలో కుమారుడు సూర్య కాంగ్రెస్ తరఫున విజయం సాధించడం ఖాయమని టాక్ నడుస్తోంది.

# పల్లెకు పట్టం కట్టాలి



ఖమ్మం : నేటి నుంచి వచ్చే నెల 2(గాంధీ జయంతి) వరకు జిల్లాలోని అన్ని పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. గాంధీ జయంతిని పురస్కరించుకుని గతేడాది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది 18 రోజులపాటు నిర్వహించే పలు రకాల కార్యక్రమాల ద్వారా మెరుగైన పారిశుద్ధ్యంతో స్వచ్ఛ గ్రామాలు రూపుదిద్దుకొంటాయని భావిస్తున్నారు. ఆర్భాట ప్రచారం, పైపై హడావుడికి బదులు పూర్తిస్థాయి కార్యాచరణతో ముందుకెళ్తేనే గతానికి భిన్నంగా జిల్లాలో ప్రతిపాదిత లక్ష్యం నెరవేరుతుంది.

జిల్లాలో పంచాయతీలు 481

మెరుపులిలా..గత సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో సౌత్ జోన్‌లో భద్రాద్రి జిల్లా తృతీయ బహుమతి సాధించింది.
2021–22లో జాతీయ స్థాయిలో చుంచుపల్లి మండలం గౌతంపూర్ పంచాయతీ ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా ప్రథమ స్థానంలో నిలిచి ఏప్రిల్–2023లో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

తూతూమంత్రంగా కాకుండా..

గతేడాది స్వచ్ఛతా హీ సేవాలో ప్రభుత్వం నిర్దేశించిన అంశాలన్నీ అమలు కాలేదన్న విషయం అర్థమవుతోంది. కేవలం రహదారుల శుభ్రం, డ్రైనేజీల్లో మురుగు తొలగింపు వంటి దైనందిన కార్యకలాపాలకే పంచాయతీ అధికారులు పరిమితమయ్యారు. ప్రారంభం రోజుల్లో హడావుడి కనిపించింది. ఆదర్శ గ్రామాల్లో మినహా తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువుల తయారీ నేటికీ ఎక్కువ పంచాయతీల్లో జరగటం లేదు. ఎరువుల తయారీ రూపంలో ఆదాయం సంపాదిస్తున్న పంచాయతీలను వేళ్లపై లెక్కించవచ్చు. ఇక నిత్యం వినియోగిస్తున్న, పారబోస్తున్న ప్లాస్టిక్‌ను పరిశీలిస్తే ఏ మేరకు పాలిథిన్‌పై అవగాహన కల్పించారో అర్థమవుతోంది. గతేడాది ఇదే సమయంలో గోదావరి వరదలు, తదనంతర పునరుద్ధరణ చర్యలు కూడా స్వచ్ఛతా హీ షెడ్యూలుపై ప్రభావం చూపింది. పక్షం రోజులపాటు కొనసాగే కార్యక్రమానికి ప్రత్యేకించి నిధులు విడుదల చేయకపోవటం ప్రతికూలాంశం.

చేపట్టే కార్యక్రమాలు..పంచాయతీ పాలకవర్గాలు, మండల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు శ్రమదానంతో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టడం.
ప్రధాన కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, మురుగు తొలగింపు.
కంపోస్ట్ షెడ్లలో తడి, పొడి చెత్త వేరుచేయడం, సేంద్రియ ఎరువుగా మార్చే చర్యలు తీసుకోవటం.
ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని అక్టోబరు 2న గ్రామసభల్లో తీర్మానాలు చేయటం.
ప్రజలు వస్త్ర సంచులు వినియోగించేలా అవగాహన కల్పించటం.
స్వచ్ఛత ప్రాధాన్యంపై విద్యాలయాల్లో క్విజ్ పోటీల నిర్వహణ, విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన పెంచటం.
టూరిజం ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధం సంపూర్ణంగా జరిగేలా చర్యలు.
పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ.

# ఆటో ప్రయాణానికి అభయం

ఖమ్మం : ఖమ్మంలో ఓ వ్యక్తి విలువైన వస్తువులతో ఆటో ఎక్కాడు. గమ్యం చేరి దిగగానే ఆటో కదలడంతో వెనుక నుంచి ఫోన్‌లో ఫొటో తీశాడు. వస్తువుల విషయం ఆ డ్రైవర్‌కు కూడా తెలియదు. ఆ తర్వాత బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఆ ఫొటోలో ఉన్న క్యూఆర్ కోడ్ ఆధారంగా పోలీసులు సదరు డ్రైవర్‌కు ఫోన్ చేసి వస్తువులను బాధితుడికి ఇచ్చారు. మరో సందర్భంలో ఒకరు విలువైన డాక్యుమెంట్లు ఆటోలో మర్చిపోవడంతో ఆ వస్తువులను తిరిగి క్యూఆర్ కోడ్ వల్ల బాధితుడికి పోలీసులు అప్పగించారు.నేరాల నియంత్రణ, ఆటో ప్రయాణికులకు భరోసా కల్పించేందుకు ఖమ్మం జిల్లా పోలీసులు 'క్యూఆర్ కోడ్ అభయ్' అనే కొత్త విధానానికి శ్రీకారంచుట్టారు. ఖమ్మంలో అయిదునెలల క్రితం ఆటో ప్రయాణికు రాలిపై జరిగిన సంఘటనతో పోలీసు కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ ప్రత్యేక దృష్టి సారించి హైదరాబాద్‌లో అమలవుతున్న ఈ విధానాన్ని జిల్లాలో అమలు చేస్తున్నారు. మహిళలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సీపీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. త్వరలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ అమలు చేయనున్నారు.

4,290 ఆటోలకు క్యూఆర్ స్టిక్కర్లు

ద్విచక్రవాహనాలు లేని మహిళలు, యువతులు, విద్యార్థినులు రాకపోకలకు ఆటోలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. వారికి భరోసా కల్పించేందుకు ఆటోలకు క్యూఆర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఖమ్మం నగరంతోపాటు జిల్లాలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే 4,290 ఆటోలకు దీనిని అనుసంధానం చేశారు. ప్రస్తుతం ఖమ్మం, సత్తుపల్లి, కల్లూరు, వైరా సర్కిల్‌లోని ఆటోలకు అమలు చేస్తున్నారు. విలువైన వస్తువులు మరచిపోయినా, డ్రైవర్లు తమపట్ల అసభ్యంగా ప్రవర్తించినా బాధితుల ఫిర్యాదుతో పోలీసులు సులువుగా సదరు ఆటో యజమానులను గుర్తిస్తారు. ఇక రాత్రి వేళల్లో మహిళలు, యువతులకు పూర్తిస్థాయిలో భద్రత ఇవ్వనుంది.

స్కాన్ చేస్తే పోలీసుల రక్షణఆటో వెనక, ముందు, డ్రైవర్ సీట్ వెనుక ఇలా మూడు చోట్ల క్యూఆర్ అభయ్ స్టిక్కర్ అతికిస్తారు. దీన్ని స్కాన్ చేస్తే సదరు ఆటో డ్రైవర్(యజ మాని)కి సంబంధించిన వివరాలు మొత్తం పోలీసులకు తెలుస్తాయి. ఆటో ఎక్కే ముందు ప్రయాణికులు తమ చరవాణిలో క్యూఆర్ కోడ్‌ను ఫొటో తీసుకోవాలి. లేదా గూగుల్ లెన్స్‌లో స్కాన్ చేయాలి. అప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలా అనే ఆప్షన్ వస్తుంది. అందులో తమకు ఎదురైన సమస్యను ఎంచుకుని క్లిక్ చేసి సమాచారం పంపాలి. దీంతో ప్రయాణికులు ఎక్కడికి వెళ్తున్నారో, ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో పోలీసులకు ఇట్టే తెలిసిపోతుంది.క్యూఆర్ కోడ్ విధానం జిల్లాలో ఇటీవలే అమల్లోకి వచ్చింది. ఆటో ప్రయాణికులకు భద్రత పెరిగింది. మంచి ఫలితాలొస్తున్నాయి. సారంగపాణి, ట్రాఫిక్ ఏసీపీ, ఖమ్మం

# చిన్న కాళేశ్వరం.. ఎప్పటికో సాకారం!

జయశంకర్ : తలాపునే గోదావరి.. ఆ పక్కన మానేరు.. అయినా సాగునీటికి కటకటే.. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినా జిల్లా ప్రజలకు ప్రయోజనం అంతంతే.. అదనంగా వెనుక జలాలతో ముంపు బాధలు ఎక్కువయ్యాయి. ఈ ప్రాంత వాసుల ఆశంతా చిన్న కాళేశ్వరం(కాళేశ్వర, ముక్తీశ్వర) ఎత్తిపోతల పథకంపైనే.. కానీ ఏళ్లు గడుస్తున్నా ఎత్తిపోతలు ఎప్పుడన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.

15 ఏళ్లుగా ఎదురుచూపే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ ఎత్తిపోతల పథకానికి 2008లో శ్రీకారం చుట్టారు. జిల్లాలోని కాటారం, మల్హర్, మహదేవ్‌పూర్, మహాముత్తారం మండలాలకు మహదేవ్‌పూర్ మండలం బీరసాగర్ నుంచి 4.5 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసేలా ప్రణాళికలు చేశారు. నాలుగు మండలాల్లో 45 వేల ఎకరాలకు సాగు నీరందించడం లక్ష్యం.. అలాగే 0.3 టీఎంసీలను తాగునీటి కోసం కేటాయిస్తారు. పనులు మొదలైన కొన్నాళ్లకే మధ్యలో ఆపేశారు. తిరిగి తెలంగాణ ఏర్పడ్డాక 2017లో పనులు మొదలయ్యాయి. శరవేగంగా జరిగాయి. బీరసాగర్, కాటారం పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్, బీరసాగర్‌లో 132/11 కేవీ ఉపకేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా పైప్‌లైన్లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, చెరువుల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కాటారంలో సబ్‌స్టేషన్ పనులు ఆగిపోయాయి. గడువు పొడిగిస్తూ పోతున్నా పనులు కావడం లేదు.

సీడబ్ల్యూసీ ఆమోదం పొందినా..గతేడాది నవంబరులో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కూడా ఆమోదం



తెలిపింది. పది నెలలు గడుస్తున్నా పనుల్లో పురోగతి లేదు. దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

భూ సేకరణలో జాప్యం..ప్రాజెక్టుకు మొత్తం 3589 ఎకరాలు అవసరం ఉండగా ఇప్పటి వరకు 891 రెవెన్యూ భూములు, 637 ఎకరాలు అటవీశాఖ నుంచి సేకరించారు. ఇంకా 2061 ఎకరాల భూ సేకరణ జరపాల్సి ఉంది. సేకరించిన భూములకు ఇప్పటికీ కొందరు రైతులకు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా పరిహారం చెల్లించి, పనులు పూర్తిచేసి నీరందివ్వాలని రైతులు కోరుతున్నారు.

ఎత్తిపోయక ముందే..గత వర్షాకాలంలో భారీ వరదలకు బీరసాగర్‌లోని పంప్‌హౌస్‌లో మోటార్లు మునిగిపోయాయి. మోటార్లు నడవక ముందే మరమ్మతులకు గురయ్యాయి. ఇప్పుడు వాటిని విప్పి మరమ్మతు చేస్తున్నారు. ఇది అదనపు వ్యయమే.

పరిహారం రాలేదుఇప్ప బాపు, ఎర్రగుంటపల్లి, కాటారం
చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కోసం 33 గుంటల భూమి తీసుకున్నారు. పరిహారం మాత్రం రాలేదు. పదేళ్లకు పైగా అవుతోంది. పరిహారం రాకపోగా, భూమిలో పంట వేసుకోలేకపోతున్నాం. రెండు విధాలా నష్టపోయాను.పనులు పూర్తిచేసి నీరందివ్వాలిబి.నరేందర్, బొమ్మాపూర్, మహదేవ పూర్
చిన్న కాళేశ్వరం పూర్తయితే మాకు సాగునీటి కష్టాలు తీరుతాయి. పనులు పూర్తిచేసి మా ప్రాంతానికి సాగునీరు అందివ్వాలి. ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలి.

# కిట్లు ఇచ్చారు.. నగదు మరిచారు!

పెద్దపల్లి : తల్లి, బిడ్డల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వాసుపత్రుల్లో నిరుపేద గర్భిణులకు సుఖ ప్రసవం కోసం సర్కారు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు తగ్గించడమే లక్ష్యంగా 'అమ్మఒడి' పథకంతో గర్భిణులకు కేసీఆర్ కిట్‌ను అందజేయడమే కాకుండా మగబిడ్డ పుడితే రూ.12వేలు, ఆడపిల్ల పుడితే రూ.13వేలను నాలుగు విడతలుగా అందిస్తుంది. తాజాగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ను కూడా అందులో చేర్చారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయిన 6 నెలల వరకు విడతల వారీగా నగదు ప్రోత్సాహాన్ని అందించాలి. 2021 సంవత్సరం నుంచి ఇప్పటివరకు కొందరికి మొదటి, రెండు విడతల్లో మాత్రమే లబ్ధిదారులకు నగదు సాయం అందింది. మూడు, నాలుగు విడతల నగదుసాయం పంపిణీ ఊసేలేదు. బాలింతలు, కుటుంబసభ్యులు వైద్య సిబ్బందిని ప్రశ్నించగా ప్రభుత్వం నిధులు జమ చేయడం లేదని చెబుతున్నారు.

రెండేళ్లుగా ప్రోత్సాహకాల జాడేదీ!



జిల్లాలో 18 గ్రామీణ, 7 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి, గోదావరిఖని ప్రాంతీయ వైద్యశాల, సుల్తానాబాద్, మంథని సీహెచ్‌సీలున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2017 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మొత్తం 1,36,527 ప్రసవాలు జరిగాయి. అమ్మఒడి లబ్ధిదారులకు దాదాపు రూ.1.80 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో రూ.1.05 కోట్లతో 85,761 మందికి కేసీఆర్ కిట్లు, నగదు సాయం అందజేశారు. మరో 50,766 మందికి దాదాపు రూ.75 లక్షల వరకు ఆర్థిక సాయం అందాల్సి ఉంది. ఇందులో రెండేళ్లుగా సాయం రాని వారు కూడా ఉన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3,180 ప్రసవాలు మాత్రమే జరగగా వీరందరికీ కేసీఆర్ కిట్ ఇచ్చినా ఒక్కరికీ నగదు సాయం అందలేదు.

త్వరలోనే నగదు సాయం అందిస్తాం– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి
నగదు పారితోషికాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకే ప్రభుత్వం మళ్లిస్తోంది. కేసీఆర్ కిట్ల కొరత లేదు. రెండేళ్ల నుంచి విడతల వారీగా నగదుసాయం అందిస్తున్నాం. ఆధార్ అప్‌డేట్, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా కొందరికి నగదు సాయం జమకావడం లేదు. త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ద్వారా ఆర్థికసాయం అందిస్తాం.

# ప్రసాదాల, తలంబ్రాల తయారీ వేదికల మార్పు

ఖమ్మం : భద్రాచలం రామాలయంలో శ్రీరామనవమికి ఎంతటి విశిష్టత ఉంటుందో సీతారాముల వారి కల్యాణ తలంబ్రాలకు అంతే ప్రాధాన్యం దక్కుతుంది. సుదీర్ఘ కాలం నుంచి వీటిని చిత్రకూట మండపంలో తయారు చేయడం ఆనవాయితీ. ఈసారి స్వర్ణ ద్వాదశ వాహనాలు రావడంతో వాటిని ఇందులో ఉంచారు. ఈ పరిస్థితుల్లో అక్షతల తయారీకి మరో పవిత్రమైన వైకుంఠ ద్వారాన్ని గుర్తించారు. దీన్ని వైకుంఠ ఏకాదశి రోజున తెరచి దర్శన భాగ్యం కల్పిస్తుంటారు. సాధారణ రోజుల్లో ఈద్వారం మూసి ఉంటుంది. ఇలాంటిచోట సీతారాముల వారి తలంబ్రాలను తయారు చేయాలని ఆలయాధికారులు నిర్ణయించారు. ఈనెల 7న వచ్చే ఫాల్గుణ పౌర్ణమి ఎంతో పవిత్రమైందని వైదిక పెద్దలు తెలిపారు. ఆరోజు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేస్తారు. బేడా మండపంలో వసంతోత్సవం జరిపి డోలోత్సవం నిర్వహించడంతో రాములవారు భక్తులకు పెళ్లికుమారుడిలా కనిపించనున్నారు. నిత్య కల్యాణం ఉండదు. ఆరోజే వార్షిక కల్యాణ పనులను అధికారికంగా ఆరంభిస్తారు. పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం నిమిత్తం ఎంపిక చేసిన వైదిక పెద్దలను దేశంలోని ప్రముఖ నదీ జలాల సేకరణకు ఇదేరోజు పంపించనున్నారు. తలంబ్రాల బియ్యంలో కలిపేందుకు ముందుగా రోలు రోకలికి పూజ చేసి పసుపు కొమ్ములను సంప్రదాయబద్ధంగా మహిళలు దంచుతారు. నెయ్యి, నూనె, పసుపు, కుంకుమ, గులాలు, సెంటు, రోజ్ వాటర్‌తో సుగంధభరితంగా వీటిని కలుపుతారు. రాముడి అక్షతలు శాశ్వతమైనవి కావడంతో వీటిని భక్తులు స్వీకరించి శుభకార్యాలకు ఉపయోగిస్తారు. మొత్తంగా 180 క్వింటాళ్ల బియ్యాన్ని తలంబ్రాలుగా తయారు



చేయాలని భావిస్తున్నారు. తొలిరోజు 100 క్వింటాళ్లను అందుబాటులో ఉంచుతారు. 12ఏళ్లకోసారి వచ్చే వేడుక కావడంతో భక్తుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని ఉత్తర ద్వారం వద్ద బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరూ తలంబ్రాలను కలిపేలా క్యూలైన్లలో వసతులు కల్పించాలని యోచిస్తున్నారు.

రద్దీని అనుసరించి ప్రసాదాలు..

ఈసారి ప్రసాదాలను తాజాదనంతో నాణ్యతగా ఉంచేందుకు ప్రణాళిక రూపొందించారు. రద్దీని అనుసరించి లడ్డూలు తయారుచేయనున్నారు. 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు అందుబాటులో ఉంచుతారని అంచనా. ఉత్సవాల వేళ వీటిని చిత్రకూట మండపంలో తయారు చేయటం ఆనవాయితీగా వస్తున్నా ఈసారి అక్కడ స్వర్ణ వాహనాలు ఉండటంతో వేదికను మార్చారు. లడ్డూలను తానీషా కల్యాణ మండపం పైభాగంలో తయారుచేయాలని నిర్ణయించారు. గోదావరి పుష్కరాలకు ఇక్కడే చేశారు. ఇక్కడ వీలు కాకుంటే ధ్యానమందిరంలో తయారుచేసే అవకాశముంది. భక్తుల సౌకర్యార్థం తలంబ్రాలు, ప్రసాదాల తయారీ వేదికను మార్చినట్లు ఈఓ రమాదేవి తెలిపారు. భక్తులు మెచ్చేలా సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలను నిర్వహిస్తామన్నారు.

# వృద్ధురాళ్లూ.. సభ్యులే !


జనగామ : సమాజంలోని మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా సభ్యులు పేదరికాన్ని అధిగమించేలా 2002 నుంచి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కృషి చేస్తోంది. సంఘాల్లో చేరే సభ్యుల వయస్సును 18 నుంచి 60 ఏళ్లకు పరిమితం చేయడంతో మహిళలు అధిక సంఖ్యలో పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు దూరమవుతున్నారు. దీంతో పేదలను పేదరికం నుంచి విముక్తి చేసేందుకు సార్వత్రిక సామాజిక సమీకరణం (యూనివర్సల్ సోషల్ మొబిలైజేషన్) అనే ప్రధాన ఆశయం దెబ్బతింటోందని గ్రహించారు.

వృద్ధాప్యం అడ్డుకావొద్దని.. : వయోపరిమితి, ఇతర కారణాలతో పొదుపు సంఘాల్లో సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. కనీస సంఖ్య లేని సంఘాలకు బ్యాంకు రుణాలు లభించని దుస్థితి నెలకొంది. దీంతో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు కూడా అవకాశం ఇవ్వాలని సంకల్పించారు. వృద్ధురాళ్లతో కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అన్ని జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖలను ఆదేశించింది.

మూడు విభాగాలుగా..60 ఏళ్లు నిండిన వారు, దివ్యాంగ, 18 ఏళ్లు నిండిన మహిళలను గుర్తించి కొత్త సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. తక్కువ సభ్యులున్న సంఘాల్లో కొత్తవారిని చేర్పించడం, వృద్ధ, దివ్యాంగ మహిళలతో ప్రత్యేక స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు సర్వే ప్రక్రియ పూర్తయింది. ఇప్పటికే ఉన్న సంఘాల్లో 60 ఏళ్లు నిండిన వారిని, ఎప్పటికప్పుడు కొత్త సంఘాల్లో చేర్చడం లేదా, 60 ఏళ్ల వయసున్న వారి సంఘాల్లో ఖాళీలుంటే వాటిలో భర్తీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇ(ఎల్డర్)ఎస్‌హెచ్‌జీ గుర్తింపు కోడ్‌తో సంఘాలను ఆన్‌లైన్‌లో చేర్చి, వీవోలో నమోదు చేస్తున్నారు.తొలగింపులకు అడ్డుకట్ట: కొన్ని చోట్ల సంఘాల ప్రతినిధులు, గ్రామైక్య సంఘాలు, సమాఖ్యలు సభ్యులను వివిధ కారణాలతో తొలగిస్తున్నట్లు గుర్తించారు. 10 మంది కంటే తక్కువగా ఉన్న ఏ సంఘం నుంచి సభ్యులను తొలగించేందుకు వీలులేని విధంగా ఎస్‌హెచ్‌జీ అకౌంటింగ్ యాప్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. వలసపోయిన, చనిపోయిన సందర్భాల్లో తప్ప ఇతర పరిస్థితుల్లో తొలగించడానికి ఇక వీలుండదు. పలు అంశాలను ప్రామాణికంగా తీసుకొని సంఘాల పనితీరుకు గ్రేడ్లు ఇవ్వనున్నారు. రుణాలు, చెల్లింపుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.

కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం- గూడూరు రాంరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి 60 ఏళ్లు దాటి, సభ్యులు కాని వారిని గుర్తించి వారితో సంఘాలను ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. పొదుపు సంఘాల్లో చేరేందుకు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి, వారితో స్వయంసహాయక సంఘాలను ఏర్పాటు చేయిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో స్వయం సహాయక సంఘాల నుంచి 60 ఏళ్లు దాటిన వారి తొలగింపు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ -10485, జనగామ-10437, జయశంకర్ భూపాలపల్లి-7569, మహబూబాబాద్-13916, ములుగు-4531, వరంగల్-9193.

# దత్తపుత్రుడి పేరిట దగా



ఖమ్మం : నగరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఓవైపు స్థిరాస్తి వ్యాపారం, మరోవైపు ఇబ్బడిముబ్బడిగా నగరం విస్తరిస్తుండటంతో ఖమ్మం గ్రామీణం మండలంలోని భూముల విలువ అమాంతం పెరుగుతోంది. ఫలితంగా రూ.కోట్ల విలువైన స్థలాల్లో పాగా వేసేందుకు ముఠాలు రంగంలోకి దిగుతున్నాయి. ఈ కోవలోనే నయా దందా వెలుగులోకి వచ్చింది. భూ యజమాని బతికి ఉండగానే.. చనిపోయినట్టు తప్పుడు ధ్రువపత్రం సృష్టించడమే కాదు.. ఓ దత్తపుత్రుడిని సైతం తెరపైకి తీసుకొచ్చి ఐదెకరాల భూమిని స్వాహా చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఈ వ్యవహారంలో దత్తపుత్రుడితోపాటు రెవెన్యూ అధికారులు, దళారుల పాత్ర బట్టబయలవటం చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం గ్రామీణం తహసీల్ కార్యాలయం వేదికగా నకిలీ ధ్రువపత్రాలతో ఐదెకరాల భూ బదలాయింపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తనగంపాడు రెవెన్యూ పరిధిలోని మూడు సర్వే నంబర్లలో ఓ వ్యక్తికి 5.38 ఎకరాల భూమి ఉంది. సదరు వ్యక్తి కొన్నేళ్ల క్రితమే హైదరాబాద్‌కు మకాం మార్చుకోవడంతో కొన్నేళ్లుగా ఆ భూమి ఖాళీగా ఉంటోంది. ఖమ్మం నగరానికి సుమారు తొమ్మిది కి.మీ. పరిధిలో ఉన్న ఈ భూమి విలువ ఎకరాకు రూ.కోట్లు పలుకుతోంది. ఈభూమిని స్వాహా చేసేందుకు ఆరు నెలల క్రితం కొందరు ప్రణాళిక రూపొందించారు. తప్పుడు పత్రాలు సృష్టించడంలో ఆరితేరిన దళారులను ఆశ్రయించారు. కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతో భూ బదలాయింపు వ్యవహారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.


పక్కా ప్రణాళికతో..రూ.కోట్ల విలువైన భూమి స్వాహాకు దళారులు పక్కాగా వ్యవహరించారు. 'ధరణి'లో నమోదైన భూయజమానికి సంతానం లేరని.. తానే దత్త పుత్రుడినంటూ ఓవ్యక్తి రెవెన్యూ అధికారులను ఆశ్రయించేలా పథకం రచించారు. ఈమేరకు భూమిని బదలాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో లొసుగులు తెలిసిన అధికారులు.. దళారులతో చేతులు కలిపి పని కానిచ్చేశారు. తొలుత భూ యజమాని నుంచి దత్తపుత్రుడి పేరిట, ఆతర్వాత మరో స్థిరాస్తి వ్యాపారి అనుచరుడికి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో భారీగానే డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బయటకు పొక్కిందిలా..

భూ బదలాయింపు ప్రక్రియ సాఫీగా సాగినా.. దళారుల మధ్య డబ్బు పంపకాల్లో తేడాలు రావడం వివాదానికి దారితీసింది. దళారులు ఈవ్యవహారాన్ని లీక్ చేశారు. ఖమ్మం గ్రామీణం తహసీల్ కార్యాలయానికి విషయం తెలిసింది. అప్రమత్తమైన అధికారులు.. సంబంధిత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి.. నిజానిజాలు నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమయ్యారు. తప్పుడు పత్రాలతో భూమిని బదలాయించిన అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

బతికి ఉన్న వ్యక్తి పేరిట నకిలీ మరణ ధ్రువపత్రం సృష్టించి భూ రిజిస్ట్రేషన్‌కు యత్నించిన తంతుపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. పత్రాలు సక్రమంగా పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగస్వాములైన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. సుమ, తహసీల్దారు, ఖమ్మం గ్రామీణం మండలం

# అడిగే వారేరీ రామా..?



భద్రాచలం : భక్తులు మెచ్చే నిర్ణయాలను తీసుకోవడంలో స్పష్టత కొరవడింది. అధికారులు ఏం చెబితే అదే శాసనంగా మారుతోంది. భద్రాచలం రామాలయంలో తాజా పరిస్థితులను పరిశీలిస్తున్న భక్తులు తమ తరఫున అడిగేవారు లేరని వాపోతున్నారు. ఇందుకు ధర్మకర్తల మండలి ఉండాలి. ఇది లేనిపక్షంలో ఇంత పెద్ద కోవెలలో భద్రాచలం ఆలయ ప్రాధికార సంస్థ (బీటీడీఏ)ను ఏర్పాటు చేయాలి. ఈ రెండు వ్యవస్థలూ లేవిక్కడ. శాశ్వత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు స్పందించాలని యాత్రికులు కోరుతున్నారు.

పదేళ్లుగా ఊసేలేని ధర్మకర్తల మండలి

భద్రాచలం రాముల వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలకు ప్రభుత్వం రూ.15 వేలు చెల్లిస్తుంది. ఇది సుదీర్ఘ కాలం నుంచి పెరగడం లేదు. ఇలాంటి ఉత్సవాల సమయంలో వస్త్రాలకు కనీసం రూ.8 లక్షలు అవసరమని భక్తుల భావన. కల్యాణ సెక్టార్‌లోకి ఏటా 20 వేల మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ ఒరవడి దశాబ్దాలుగా సాగుతోంది. ఇప్పుడు పుష్కర వేడుకల తరుణంలో 3 వేల మందికి పైగా భక్తుల సంఖ్యను కుదించటం చర్చనీయాంశమైంది. ఇలాంటి పరిస్థితులుంటే గతంలో ధర్మకర్తల మండలి నేరుగా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి భక్తులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకునేది. 2012 వరకు ధర్మకర్తలు పనిచేశారు. పదేళ్ల నుంచి మండలి లేని లోటు కనిపిస్తోంది. రెండుసార్లు ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించినా కార్యరూపం దాల్చలేదు. యాదాద్రి తరహాలో భద్రాచలం అభివృద్ధికి నిధులు రాకపోవడంతో బీటీడీఏ ఏర్పాటు కాలేదు. అధికారుల నిర్ణయాల్లో లోపాలను ప్రశ్నించేందుకు ధర్మకర్తలు లేరు.

నిధులొస్తేనే బీటీడీఏ ఏర్పాటుకు అవకాశం

యాదాద్రి ఆలయాన్ని వందలాది కోట్ల రూపాయాలతో అభివృద్ధి చేస్తున్నారు. పనులను వైటీడీఏ పర్యవేక్షిస్తోంది. భక్తులకు క్రమేణా సదుపాయాలు మెరుగుపడుతున్నాయి. వేములవాడలోనూ సౌకర్యాల కల్పనకు ఆలయ ప్రాధికార సంస్థ యత్నిస్తోంది. ఆంజనేయస్వామి కొలువైన కొండగట్టు కోవెలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించటంతో త్వరలో అక్కడా ఈ తరహా సంస్థ అందుబాటులోకి రానుంది. భద్రాచలం ఆలయ ప్రాధికార సంస్థ ఎప్పుడు ఏర్పాటవుతుందో అంతు చిక్కడం లేదు. బీటీడీఏ కార్యరూపం దాల్చితేనే ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఏర్పడుతుంది.మన్యం ప్రాంతం కావడంతో గిరిజన సంక్షేమశాఖ సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి పనుల నిమిత్తం ప్రైవేట్ స్థలాల సేకరణకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖల సాయం తప్పనిసరి. గుడి పరిసరాల్లోని మాడ వీధులు, ఇతర రహదారుల నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీర్ల సేవలు వినియోగించుకోవాలి.గోదావరి వద్ద ఏర్పాట్లకు జలవనరుల శాఖతో సఖ్యత అవసరం. పోలీసుల నుంచి బందోబస్తు పొందాలి.ఇవన్నీ ఇప్పుడు కొనసాగుతున్నప్పటికీ కొన్ని శాఖల మధ్య సమన్వయం లేదు. ఎలాంటి చిక్కులు తలెత్తకూడదంటే బీటీడీఏ ఉండాలి. ఇది సాధ్యపడాలంటే ఇప్పటికే రెండు బడ్జెట్లలో పొందుపర్చిన రూ.150 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయాలి.ఆరేళ్ల క్రితం రూపొందించిన ఆలయ నమూనా ప్రణాళికలు కాగితాలకే పరిమితం కాకుండా చూడాలి. ప్రస్తుత అవసరాల మేరకు టూరిజం నిధులతో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి.

# రాథం చెరువు మింగేస్తుండ్రు

భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణంలో ఆక్రమణదారులు బరితెగించారు. పైకి పెద్దమనుషులుగా వ్యవహరిస్తూ తెరవెనుక భూదందా చేస్తున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న రాథం చెరువు కాకతీయుల కాలంనాటిది. మొత్తం 77.22 ఎకరాలు ఉండేది. బడా నాయకులు, పలుకుబడి ఉన్నవారు చెరువు శిఖం ఆక్రమించి ఇళ్లు నిర్మించారు. కొందరేమో పట్టా భూములను అడ్డుపెట్టుకొని వెంచర్లు వేశారు. మరికొందరు 300 నుంచి 400 గజాల వరకు మొరం పోసుకొని ఆక్రమించి అమ్ముకుంటున్నారు. ఆక్రమణల పర్వం ఇలాగే కొనసాగితే పర్యాటకం మాట దేవుడెరుగు.. దాని ఆనవాళ్లే ఉండవు. సర్వేతో పాటే అమ్మకాలు వారం రోజుల్లో సర్వే పూర్తి చేస్తామన్న రెవెన్యూ అధికారులు మూడు వారాలు అవుతున్నా నివేదికను తహసీల్దార్‌కు సమర్పించనేలేదు. కేవలం ఒకటి రెండు రోజులు సర్వే చేస్తున్నట్లు నటించి వదిలేశారు. ఇలాగే కొనసాగితే 77.22 ఎకరాల విస్తీర్ణం సర్వే చేసేందుకు మరో ఏడాది పట్టొచ్చు. ఎందుకు సర్వే చేయడం లేదని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే ఆక్రమణదారులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఒత్తిడి తెస్తున్నారని సెలవిస్తున్నారు. చెరువును ఆనుకొని ఉన్న సర్వే నంబర్లు చూపి శిఖాన్ని రిజిస్ట్రేషన్లు చేయించారు. రియల్ వ్యాపారులు తమ దందా సజావుగా సాగేందుకు ఇది వరకే రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ప్రసన్నం చేసుకున్నట్లు తెలిసింది. పైగా ఏ పట్టా పాసు పుస్తకం తెచ్చినా నాలా ఉంటే సరిపోతుందని భీమ్‌గల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు వత్తాసు పలుకుతున్నారు.

# ఆత్మరక్షణ వైపు అడుగులు!

మహబూబాబాద్ : బాలికల్లో కొరవడిన ధైర్య సాహసాల కారణంగా సమాజంలో చోటుచేసుకుంటున్న కొన్ని అవాంఛనీయ పరిణామాలు అందరిని కలవర పెడుతున్నాయి.. దీనికి విరుగుడు అన్నట్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బాలికలకు కరాటే విద్యలో శిక్షణనిచ్చే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. తాజాగా ఇది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు విస్తరించింది. ఈ సాధన ఆత్మ రక్షణతో పాటు ఏకాగ్రత పెంపునకు దోహద పడుతుందనడంలో అతిశయోక్తి లేదు. శిక్షణ పొందడానికి విద్యార్థినులు ఎంతో ఆసక్తి చూపుతుండగా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి పాఠశాలకు రూ.5 వేల చొప్పున ప్రత్యేక గ్రాంటు మంజూరు చేసింది. ఇప్పటికే అనేక బడుల్లో కరాటే శిక్షకులు నియమితులయ్యారు. వీరు వారానికి రెండుసార్లు సాధన చేయిస్తున్నారు. సీరోలు మండలం చిల్కోయలపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కరాటే సాధన చేస్తున్న బాలికలతో మాట్లాడి ప్రత్యేక కథనం.

పీఈటీనవుతా: పొన్నం అనూరాధ, 7వ తరగతి

కరాటే విద్య సాధన మొదలెట్టాక నాలో తెలియని ఉత్సాహం నెలకొంది. ఆపదలో ఉన్నప్పుడు ధైర్య సాహసాలు ప్రదర్శించడానికి ఇది ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా సాధన చేస్తుండటం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నా. వ్యాయామ ఉపాధ్యాయురాలిని కావాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నా.



సాధనపైనే దృష్టి: త్రిష, 8వ తరగతి

హనుమకొండలో ఇటీవల జరిగిన కరాటే పోటీలకు మహబూబాబాద్ జిల్లాకు చెందిన కస్తూర్బా గాంధీ విద్యాలయాల నుంచి ప్రాతినిధ్యం వహించిన బాలికలు సాధించారు. ఇది నాలో ప్రేరణ నింపింది. కరాటే సాధన చేయడం ఎలాగని మదనపడుతున్న క్రమంలో మా బడిలోనే శిక్షణ మొదలెట్టారు. బాగా సాధన చేసి పతకాల సాధనపైనా దృష్టి పెడతాఏకాగ్రత అలవడుతుంది: కరుణశ్రీ, 6వ తరగతి

కరాటే విద్యలో సాధన ఆత్మ రక్షణ కోసమేననే భావన అందరిలో ఉంది. ఇది ముమ్మాటికి నిజం. నేను సాధన మొదలెట్టాక నాలో ఏకాగ్రత అలవడింది. ఇది చదువులనూ ప్రభావితం చేస్తుంది. ఉన్నత విద్యనభ్యసించి సమాజ సేవకు ఉపయోగపడే కొలువులో స్థిర పడాలనేది నా లక్ష్యంబాలికల్లో ఉత్సాహం కనిపిస్తోంది- శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, చిల్కోయలపాడు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు తోడు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు కలిపిస్తుంది. ఇప్పుడిక బాలికల్లో ధైర్య సాహసాల పెంపునకు కరాటే విద్యలో శిక్షణ ఇస్తోంది. ఈ విద్య నేర్పించడానికి ప్రభుత్వం గ్రాంటు విడుదల చేస్తుంది. ఖమ్మానికి చెందిన కరాటే మాస్టర్ సైదులును మాట్లాడి శిక్షణ ఇప్పిస్తున్నాం.

# గ్రామీణులకు ఆరోగ్యయోగం

భూపాలపల్లి : నేటి సమాజంలో ప్రజలు ఉరుకుల పరుగుల జీవితం గడుపుతున్నారు.. కష్టమే తెలియకుండా జీవనం కొనసాగిస్తున్నారు.. సమయపాలన లేకుండా విధులను నిర్వహించడం, మారుతున్న ఆహారపు అలవాట్లు తదితర వాటితో ప్రజా జీవితం అనారోగ్యమయమవుతోంది.. గతంలో పట్టణాల్లో ఉన్నటువంటి సంస్కృతి ఇప్పుడు గ్రామాల్లోకి వచ్చింది. దీంతో చాలా మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకున్న కేంద్రం గ్రామాల్లో యోగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. పల్లెల్లో కేంద్రాలు ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రజలతో యోగాసనాలు వేయడం, మంచి ఆహారపు అలవాట్లను నేర్చుకోవడంతో అనారోగ్య సమస్యల నుంచి బయటపడే అవకాశం ఉంది.ఆయుష్ మిషన్ పథకంలో..నేషనల్ ఆయుష్ మిషన్ పథకంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు మొదటి విడతగా 8 యోగా కేంద్రాలను మంజూరు చేసింది.. ఒక్కో కేంద్రాన్ని రూ.6 లక్షలతో నిర్మించనున్నారు. జిల్లాలోని కాటారం మండలం దామెరకుంట, మహాముత్తారం, మహదేవ్‌పూర్, మల్హర్ మండలం వల్లెంకుంట, గణపురం మండలం ధర్మరావుపేట, రేగొండ మండలం కొడవటంచ, మొగుళ్లపల్లి, చిట్యాల మండలం చల్లగరిగెలో యోగా కేంద్రాలను నిర్మించనున్నారు. గణపురం మండలం ధర్మరావుపేట, కాటారం మండలం దామెరకుంటలో నిర్మాణాలు పూర్తికాగా కొడవటంచలో నిర్మాణ పనులు ప్రారంభించారు. మిగిలిన చోట్ల టెండర్ల దశలో ఉన్నాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. ప్రతి ఒక్క యోగా కేంద్రానికి ఇద్దరిని నియమించి వారికి తగిన శిక్షణ అందించి వారి ద్వారా ప్రజలకు యోగాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా సంబంధిత ఆయుష్ విభాగం అధికారులు ప్రణాళిక తయారు చేస్తున్నారు.

క్రమం తప్పకుండా చేస్తే.. ఎన్నో లాభాలు

క్రమం తప్పకుండా యోగా చేయడంతో ఎన్నో లాభాలు ఉంటాయని ఆయుష్ వైద్యాధికారులు తెలుపుతున్నారు. నిత్యం యోగా చేయడంతో శరీరం అంతటా రక్త ప్రసరణ జరగడంతో పాటు ప్రాణవాయువు సక్రమంగా అందుతుంది. ఒత్తిడిని జయించడంతో పాటు రక్తపోటును తగ్గించుకోవచ్చని యోగా గురువులు తెలుపుతున్నారు. యోగా ఆసనాలు శరీరంతో పాటు మెదడుపై ప్రభావం చూపి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా మనం తీసుకునే ఆహారంలోని పోషకాలన్నింటిని మన శరీరం గ్రహించాలంటే సరైన పద్ధతిలో జీర్ణమవ్వాలి. ఆహారం సరిగా జీర్ణం కాకపోవడంతో పలు రకాల అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి. రోజూ యోగా చేయడంతో ఆహారపు అలవాట్లలో మార్పు చెందడమే కాకుండా జీర్ణక్రియ వ్యవస్థ మెరుగుపడుతుందని యోగా గురువులు చెబుతున్నారు.

ప్రజలకు ఎంతో ఉపయోగం- డాక్టర్ తనూజ, ఆయుష్ వైద్య విభాగం అధికారిఆయుర్వేద వైద్యం ఎంతో ప్రాచీనమైనది.. మన పూర్వీకులు ఎక్కువగా ఆయుర్వేద వైద్యాన్నే నమ్ముకునేవారు.. నేడు మారుతున్న సమాజంలో ప్రజలు ఎన్నో రకాల జబ్బులకు గురవడంతో పాటు, మానసిక ఒత్తిడి ఇతర అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే యోగా కేంద్రాలు అలాంటి వారికి ఎంతో లబ్ధి చేకూర్చనున్నాయి. నిత్యం యోగా కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రజలు యోగా కేంద్రాలను సద్వినియోగం చేసుకుంటే వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

# శ్రీవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్



తిరుమల: కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. పద్మావతి అతిథి గృహం నుంచి శ్రీవారి ఆలయానికి చేరుకున్న సీఎం వైయస్ జగన్‌కు మహాద్వారం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనం అనంతరం శ్రీరంగనాయకుల మండపానికి సీఎం వైయస్ జగన్ చేరుకున్నారు.

శ్రీరంగనాయకులు మండపంలో సీఎం వైయస్ జగన్‌కు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వేద పండితులు ముఖ్యమంత్రికి ఆశీర్వచనం అందజేశారు. సీఎం వెంట డిప్యూటీ సీఎంలు నారాయణ స్వామి, కొట్టు సత్యనారాయణ, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్.కే.రోజా, ఎమ్మెల్సీ భరత్, ఈవో ధర్మారెడ్డి ఉన్నారు.

# నీటి విలువ, సీమ కష్టాలు తెలిసిన ప్రభుత్వం మనది

## లక్కసాగరం పంప్‌హౌస్‌ను ప్రారంభించిన సీఎం వైయస్ జగన్



డోన్: నీటి విలువ, రాయలసీమ నీటి కష్టాలు తెలిసిన ప్రభుత్వం కాబట్టే అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీరు, తాగు నీరు అందించే చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలను పట్టించుకోలేదని గుర్తు చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు సాగు నీరు అందించేందుకు లక్కసాగరం పంప్‌హౌస్ ద్వారా 77 చెరువులకు నీరు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి చెరవులకు నీటి కేటాయింపు జరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఎన్నికలకు 4 నెలలకు ముందు జీవోలు, శంకుస్థాపనలు చేశారు. ప్రాజెక్ట్ కోసం భూమిని కూడా కొనుగోలు చేయలేదు. కేవలం టెంకాయలు కొట్టడానికి ఏదో నామ మాత్రంగా 8 ఎకరాలు కొనుగోలు చేశారని విమర్శించారు. డోన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రసంగించారు.

**సీఎం వైయస్ జగన్ ఏమన్నారంటే..** ఈ రోజు మీ అందరి చిక్కటి ఆప్యాయతల మధ్య..ఒక వైపు పండుగ రోజు ..మరో వైపు మీ అందరి ప్రేమానురాగాల మధ్య మరో మంచి కార్యక్రమానికి ఇక్కడి నుంచి శ్రీకారం చుడుతున్నాను. ప్రతి ఒక్కరికీ పేరు పేరున హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మనందరి ప్రభుత్వం నీటి విలువ తెలిసిన ప్రభుత్వంగా, రాయలసీమ నీటికష్టాలు తెలిసిన మీ బిడ్డగా ఈ నాలుగేళ్ల పరిపాలనలో శాశ్వతమైన మార్పు తీసుకురావాలని మంచి ఉద్దేశంతో అడుగులు వేయడం జరిగింది. అందులో భాగంగానే ఈ రోజు కర్నూలు, నంద్యాల జిల్లాలకు మంచి జరిగిస్తూ ఇక్కడి నుంచి ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాల్వ నుంచి మెట్టప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించే కార్యక్రమం లక్కసాగరం వద్ద పంప్ హౌస్ ఏర్పాటు చేసి 77 చెరువులు నింపే కార్యక్రమం ఇది. రోజుకు 160 క్యూసెక్కుల చొప్పున 90 రోజుల్లో 1.4 టీఎంసీల నీరు నింపే కార్యక్రమం మొదలవుతుంది. ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే..పక్కనే శ్రీశైలం ఉన్నా కూడా ఈ మెట్ట ప్రాంతాలకు పత్తికొండ, డోన్ నియోజకవర్గాలకు సాగునీరు అందని దుస్థితి. డోన్‌లో మరీ ఒక్క ఎకరా కూడా ఇరిగేషన్ లేని పరిస్థితి. గతంలో ఎవరూ కూడా పట్టించుకునే పరిస్థితి లేదు.

2019 మార్చిలో ఎన్నికలు జరిగాయి. 2018 నవంబర్ ..అంటే ఎన్నికలకు కేవలం 4 నెలల ముందు ఒక జీవో ఇచ్చి టెంకాయ కొట్టాడు. కనీసం భూ సేకరణ కూడా చేయలేదు. అటువంటి దారుణమైన మోసాల మధ్య మీ బిడ్డ ప్రభుత్వం, మనందరి ప్రభుత్వం ఏర్పడింది. రాయలసీమ బిడ్డగా, నీటి విలువ తెలిసిన బిడ్డగా ఈ ప్రాంతానికి తోడుగా నిలబడేందుకు రూ.250 కోట్లు ఖర్చు చేసే ఈ ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపాదికన చేపట్టాం.

# ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవాత్రి మహోత్సాల తేదీలు ఇవే...



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల కోసం అధికారుల, పాలకమండలి సర్వం సిద్ధం చేశారు. ఆలయంలో ఏర్పాట్లపై ఇంద్రకీలాద్రి దుర్గగుడి పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. దసరాలో గతంలో ఇంజనీరింగ్ వర్క్స్2కు 2.5 కోట్లు ఖర్చు చేసామని చెప్పారు. పలు దేవాలయాల నుంచి సిబ్బందిని తీసుకొచ్చి దసరాకు వినియోగిస్తామని.. పది రోజులకు కాంట్రాక్టు పద్ధతిలో కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్నదాన భవనం కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు.

**శవన్నవరాత్రి ఉత్సవాలు...** ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 15 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 15న ఉత్సవాల తొలిరోజు శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమివ్వనున్నారు. 16న శ్రీ గాయత్రీ దేవి అలంకారం, 17న శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారం, 18న శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారం, 19న శ్రీ మహాచండీ దేవి అలంకారం, 20న శ్రీ సరస్వతీ దేవి అలంకారం (మూలానక్షత్రం). అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల మధ్యలో సీఎం జగన్ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. 21న శ్రీ లలితా త్రిపురసుందరీ అలంకారం, 22న శ్రీ దుర్గాదేవి అలంకారం, 23న శ్రీ మహిషాసురమర్ధనీ దేవి అలంకారం... మధ్యాహ్నం నుంచీ శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 200 మంది ఇతర దేవాలయాల నుంచి సిబ్బంది వస్తారని.. అన్ని శాఖల అధికారులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూస్తారని చెప్పారు. కొండచరియలు జారిపడిన కారణంగా క్యూలైన్లు దుర్గాఘాట్‌వైపు మార్చడం జరుగుతుందని కర్నాటి రాంబాబు వెల్లడించారు. ఈవో భ్రమరాంబ మాట్లాడుతూ.. వినాయకుడి గుడి వద్ద నుంచి క్యూలైన్లు ప్రారంభమవుతాయన్నారు. ఎప్పటిలాగే ఐదు క్యూలైన్లు ఉంటాయన్నారు. కేశఖండన శాలకు 600 మంది సిబ్బంది ఉంటారన్నారు. భక్తులు నిలిచే ప్రదేశాలను గుర్తించి షెడ్లు వేస్తున్నామని.. జల్లు స్నానాలకు షవర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పది ప్రసాదం కౌంటర్లు ఉంటాయని.. మోడల్ గెస్ట్ హౌస్, స్టేట్ గెస్ట్ హౌస్‌ల వద్ద కూడా ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీవీఐపీల దర్శనంపై స్లాట్లు కూడా నిర్ణయిస్తామన్నారు. బడ్జెట్ రూ.7 కోట్లు అని.. గతంలో లాగానే భక్తుల రద్దీ ఆశిస్తున్నామన్నారు. దసరా 9 రోజులూ అంతరాలయ దర్శనం లేదని ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు.



## గ్రూప్ ఫొటోతో పార్లమెంట్ పాత భవనానికి వీడ్కోలు

దిల్లీ: స్వతంత్ర భారత్‌లో చోటుచేసుకున్న ఎన్నో కీలక ఘట్టాలకు పాత పార్లమెంట్ సాక్షిగా మిగలనుంది. మరికొన్ని గంటల్లో చట్టసభల కార్యకలాపాలు కొత్త భవనంలోకి మారనున్నాయి. ఈ సమయంలో పాత భవనం జ్ఞాపకాలను పదిలపరుచుకునే ఉద్దేశంతో ఉభయ సభల సభ్యులంతా కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వారంతా దీనికోసం మంగళవారం ఉదయం పాత పార్లమెంట్ ప్రాంగణానికి వచ్చారు. మొదట ఉభయ సభల సభ్యులంతా కలిసి గ్రూప్ ఫొటోకు పోజు ఇచ్చారు. తర్వాత రాజ్యసభ సభ్యులు, లోక్‌సభ సభ్యులు విడివిడిగా ఫొటో దిగారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తదితరులు ముందు వరుసలో కూర్చున్నారు. ఉపరాష్ట్రపతి, రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ మధ్యలో మోదీ కూర్చొని కనిపించారు. ఈ ఫొటో తర్వాత ఉదయం 11.30 గంటలకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎంపీలు భేటీ అవుతారు. అక్కడ అన్ని లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత ప్రధాని మోదీ, రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్, మంత్రులు, ఎంపీలు కొత్త పార్లమెంట్‌కు పాదయాత్రగా వెళ్తారు. సెంట్రల్ హాల్‌లో ఉన్న రాజ్యాంగ పుస్తకాన్ని మోదీ స్వయంగా తీసుకెళ్లనున్నారు. ఆ తర్వాత కొత్త భవనంలో లోక్‌సభ కార్యకలాపాలు మధ్యాహ్నం 1.15కి ప్రారంభం కానున్నాయి.

అలాగే రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం 2.15 మొదలవుతాయి. రైసినా హిల్స్ లో నూతనంగా నిర్మించిన భవనమే ఇకపై భారత పార్లమెంట్ అని కేంద్రం నిన్న రాత్రి గెజిట్ విడుదల చేసింది. లోక్‌సభ స్పీకర్ ఆమోదంతో లోక్‌సభ సచివాలయం ఈ మేరకు బులెటిన్ విడుదల చేసింది.




## కొత్త పార్లమెంట్ భవనం.. విశేషాలివే!

చట్టసభలు అంటే ప్రజాస్వామ్య దేవాలయాలు. ప్రజల వాణిని వినిపించే వేదికలు. ఆ భవన నిర్మాణ రూపాలు స్మరణకు వచ్చినంతనే దేశం పట్ల గౌరవాన్ని ఇనుమడింపజేసే కట్టడాలు. అలాంటి చట్టసభల చరిత్రలో భారత్‌లో కీలక ఘట్టానికి సమయం ఆసన్నమైంది.

పార్లమెంటు సమావేశాలు ఇక శాశ్వతంగా కొత్తగా నిర్మించిన భవనం లోనే జరగనున్నాయి. ఇన్నాళ్లూ సమావేశాలు జరిగిన పాత పార్లమెంటు భవనం గత చరిత్రగా మిగిలిపోనుంది. మరి కొత్త భవనం విశేషాలు ఏమిటి? పాత భవనంతో పోలిస్తే దీని ప్రత్యేకతలు ఎలా ఉన్నాయి? ఇన్నాళ్లూ లేనిది ఈ సమయంలోనే కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది?

# టీడీపీ నేతల హౌస్ అరెస్ట్ దుర్మార్గం



అమరావతి: టీడీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమని టీడీపీ శాసనమండలి ప్రతిపక్ష నేత, పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గుళ్లు, మసీదులు, చర్చిల్లో ప్రార్థించేందుకు వెళ్తున్న టీడీపీ నేతలను అడ్డుకోవడం మత విశ్వాసాలను అవమానించడమే అని అన్నారు. జగన్ రెడ్డి పాలనలో దేవుడిని దర్శించుకునే స్వేచ్ఛ కూడా ప్రజలకు లేదా? అని ప్రశ్నించారు. ఇది పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే అని అన్నారు. ప్రజల మనిషి చంద్రబాబుపై జగన్ రెడ్డి కక్ష కట్టారని మండిపడ్డారు. పోలీసులు వైసీపీ తొత్తులుగా వ్యవహరించడం సరికాదన్నారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకొస్తారని యనమల రామకృష్ణుడు ధీమా వ్యక్తం చేశారు.




## ఈ ఫిర్యాదే ఒక అభూత కల్పన.. - హరీశ్ సాల్వే

అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు లో వాదనలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం మొదలైన వాదనలు భోజన విరామం అనంతరం తిరిగి కొనసాగుతున్నాయి. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన ఈ కేసులో పలు కీలక అంశాలను హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అసలు ఈ ఫిర్యాదే ఓ అభూత కల్పనని అన్నారు. హైకోర్టు ముందు ఆయన వినిపించిన వాదనల్లో కొన్ని కీలక అంశాలను పరిశీలిస్తే.. "ఈ కేసులో ఎఫ్‌ఐఆర్‌పై గతంలో జరిగిన దర్యాప్తుపై మెమో మాత్రమే వేశారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఎ కింద తగిన అనుమతులు తీసుకోలేదు. ఈ ఎఫ్‌ఐఆర్ చట్టవిరుద్ధమైనది. గతంలో వచ్చిన జడ్జిమెంట్లను అడ్వకేట్ జనరల్ తప్పుగా అన్వయించారు. సెక్షన్ 17ఎ పూర్తివివరాలు తెలిసి కూడా తప్పనిసరి అనుమతులను తీసుకోలేదు" అని వాదించిన హరీశ్ సాల్వే ఈ సందర్భంగా స్టేట్ ఆఫ్ రాజస్థాన్ –తేజ్‌మల్ చౌదరి కేసును ఉదహరించారు.

**సెక్షన్ 17ఎ వర్తిస్తుంది.. :** "నేరం ఎప్పుడు జరిగిందన్నది కాదు.. దర్యాప్తు వేళ ఉన్న చట్టబద్ధత పరిగణించాలి. కేసు పెట్టేందుకు మూలమైన సమయం దృష్టిలో పెట్టుకొని సెక్షన్ 17ఎ వర్తిస్తుంది. ఈ కేసులో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ అనేది కచ్చితంగా వర్తిస్తుంది. 2018 చట్టసవరణ తర్వాత రిజిస్టర్ అయిన ప్రతి ఎఫ్‌ఐఆర్‌కు 17ఎ వర్తిస్తుంది. ఆ సమయంలో చంద్రబాబు సీఎంగా ఉన్నారు కనుకే ముందస్తు అనుమతి తప్పనిసరి. ఇప్పుడు పదవిలో లేరు కనుక ఆ నిబంధన వర్తించదనడం చట్టబద్ధంగా చెల్లుబాటు కాదు. కొత్త ప్రభుత్వం.. పాత ప్రభుత్వం మీద ప్రతీకార చర్యలకు పాల్పడకుండా ఈ నిబంధన పెట్టారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వ కౌంటర్ మాకు ఇచ్చారు. కౌంటర్‌లో కూడా గతంలో పొందుపరిచిన ఆరోపణలనే మళ్లీ చెప్పారు"

**ఇది కచ్చితంగా రాజకీయ ప్రతీకార కేసుగా పరిగణించాలి..** "ఇది కచ్చితంగా రాజకీయ ప్రతీకార కేసుగానే పరిగణించాలి. వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలుగుతుందన్న సమయంలో కేసును ఏకపక్షంగా చూడకూడదు. హైకోర్టు వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలగకుండా విచక్షణాధికారాన్ని వినియోగించాలి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ దీన్ని ప్రతీకారపూర్వక కేసుగానే పరిగణించాలి. ఇదే కేసుకు సంబంధించిన జీఎస్టీ ఫిర్యాదులను హైకోర్టు పరిశీలించింది. ప్రాజెక్టులో 90శాతం ప్రైవేటు సంస్థ.. 10శాతం ప్రభుత్వం భరిస్తుంది. యువతలో సాంకేతిక నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకే ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. ఎదుటి వ్యక్తులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఇదంతా జరిగినట్టుగా కనిపిస్తోంది. ఈ కేసుకు ప్రాతిపదికైన ప్రాజెక్టు రిపోర్టులు, వాటి విలువ మదింపు చేశారు. వాటి వివరాలన్నీ అందరికీ అందుబాటులో ఉన్నాయి" అని స్కిల్ డెవలప్‌మెంట్ మదింపు నివేదికను హరీశ్ సాల్వే కోర్టుకు చదివి వినిపించారు".

**శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కాలేదని ఫిర్యాదులో చెప్పలేకపోయారు..** " నగదు అంశమే ప్రభుత్వానికి సంబంధించింది.. మిగతావన్నీ ప్రైవేటు సేవలే. స్కిల్ సెంటర్లకు భూమి, అనుమతితో పాటు రూ.330 కోట్లు చెల్లించాలని ఒప్పందం. ?330 కోట్లు అనేది ప్రాజెక్టు విలువలో దాదాపు 10శాతానికి సమానం. ప్రాజెక్టులో రాష్ట్ర భాగస్వామ్యం స్వల్పం.. ప్రైవేటు సంస్థలదే అధిక బాధ్యత. ఒప్పందం తర్వాత ఎవరు ఏం చేయాలనేది అంగీకార పత్రం తీసుకున్నారు. ప్రాజెక్టు ప్రతిపాదించారు.. పూర్తయింది.. ప్రభుత్వానికి అందించారు. ప్రభుత్వానికి అప్పగించిన ఒప్పందాలు, సంతకాలు పూర్తయ్యాయి. పరిణామాలు పరిశీలిస్తే ఇది ప్రస్తుత ప్రభుత్వ అధికార దుర్వినియోగమే. అనుబంధ సంస్థే కేంద్రాలు ఏర్పాటు చేసిందని సిమెన్స్ స్పష్టం చేసింది. కేంద్రాలు ఏర్పాటు పూర్తయ్యింది.. ప్రభుత్వానికి అందించారు. ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదు. ఫిర్యాదును పరిశీలిస్తే శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కాలేదని చెప్పలేకపోయారు. సెన్‌వ్యాట్ అంశాల ఆధారంగా శిక్షణ కేంద్రాల ఛైర్మన్ ఫిర్యాదు చేశారు."

**ఈ ఫిర్యాదే ఒక అభూత కల్పన..** "ఇది కేవలం పన్ను చెల్లింపులకు సంబంధించిన ఫిర్యాదు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశారు.. నడుస్తున్నాయి. ఒకవేళ ఇన్‌వాయిస్‌లు పెంచి చూపించారన్నా అది అంతర్గత అంశమే. ఒకవేళ ఇలాంటి పరిస్థితులున్నా అప్పటి సీఎం ఎలా బాధ్యులవుతారు? ఇది కేవలం సెన్‌వ్యాట్ సమస్యే. పన్ను కేసును తీసుకొచ్చి అవినీతి నిరోధక చట్టం కింద కేసు ఎలా పెడతారు? ఈ కేసులో సెక్షన్ 17ఏ అనేది కచ్చితంగా వర్తిస్తుంది. కేసు నమోదు చేసిన వారు ముందస్తు అనుమతి తీసుకోలేదు. కేవలం మెమో ఆధారంగానే మాజీ సీఎంను నిందితుడిగా చేర్చారు. ఈ ఫిర్యాదే ఒక అభూత కల్పన. ఒప్పందంలోని అన్ని కాంట్రాక్టులు, సబ్ కాంట్రాక్టులూ ఏర్పాటు చేశారు. ఎక్కడా ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందన్న ఆధారం లేదు. ఇది సంపూర్ణంగా అసంబద్ధమైన ఆరోపణ. సీనియర్ సివిల్ సర్వీస్ అధికారులను 'హెంచ్‌మన్' అని ఎలా సంబోధిస్తారు? 'అపాయింటెడ్ హంచ్‌మెన్' అని అధికారులు ఫిర్యాదులో సంబోధించవచ్చా? ప్రాజెక్టుకు కట్టిన విలువ సరసమైనదని కేంద్ర సంస్థలు చెబుతున్నాయి. ఫిర్యాదులో ప్రైవేటు సంస్థలు లాభాలు దండుకున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థను ఈ కేసులో భాగస్వామి చేయాలి కదా? ఈ ప్రాజెక్టులో 10శాతం ప్రభుత్వంఇవ్వాలి. మిగిలింది ప్రైవేటు సంస్థలు పెట్టుకోవాలి. కాల క్రమంలో ప్రాజెక్టు పూర్తయింది.. అసలు ఈ కేసు ఎందుకు పెట్టినట్టు?" అని సాల్వే వాదనలు వినిపించారు.

**చంద్రబాబుకు 17ఎ వర్తించదు.. సీఐడీ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి –** మరోవైపు, చంద్రబాబు క్వాష్ పిటిషన్‌కు సంబంధించి సీఐడీ తరఫున ముకుల్ రోహత్గి, రంజిత్ రెడ్డి, ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు. అయితే, మాజీ సీఎం చంద్రబాబుకు 17ఎ వర్తించదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదించారు. అది పబ్లిక్ సర్వెంట్లకు మాత్రమే వర్తిస్తుందన్నారు. అరుదైన కేసుల్లో మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోవాలని.. ఇలాంటి వాటిల్లో కాదని వాదించారు. "చంద్రబాబును సెప్టెంబర్ 7న నిందితుడిగా పేర్కొన్నారు. అదే నెల 9న అరెస్టు చేశారు. 12న క్వాష్ పిటిషన్ వేశారు.. ఈరోజు 19వ తేదీ. చంద్రబాబును అరెస్టు చేసి 10 రోజులే అయింది. కేసు దర్యాప్తు ఇప్పుడే మొదలైంది. ఈ కేసును ఇప్పుడే తీసుకోవద్దని కోర్టుకు మనవి చేస్తున్నాం. పిటిషనర్ తరఫున 900 పేజీల డాక్యుమెంట్ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కేసును విచారణకు తీసుకోవద్దు. ఇంత లోతైన కేసు దర్యాప్తు 10 రోజుల్లో సాధ్యం కాదు. ఇప్పటికే పిటిషనర్ బెయిల్ కూడా దరఖాస్తు చేశారు. నిధుల దుర్వినియోగం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలింది. నిధుల దుర్వినియోగం కేసులో 17ఎ వర్తించదు. పథకం ప్రకారం రూ.370 కోట్ల కుంభకోణం జరిగింది. ప్రభుత్వ నిధులు దోచుకోవడాన్ని ప్రజాసేవ అనలేం. ఐఏఎస్ అధికారి సంతకం చేసినందున స్కామ్ అనకుండా ఉండలేం. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో పన్నుల శాఖ, పీఎంఎల్ఏ దర్యాప్తు జరుగుతోంది" అన్నారు.




# చంద్రబాబుకు మద్దతుగా చెన్నైలో తెలుగు ప్రజల ఆందోళన

చంద్రబాబుకు మద్దతుగా చెన్నైలో తెలుగు ప్రజలు, ఐటీ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఏపీలో ఇప్పటికీ రాజధాని లేదని, మూడు రాజధానుల పేరుతో ఏపీని నాశనం చేశారని వారు ధ్వజమెత్తారు. ఏపీలో అవకాశాలు లేకే పక్క రాష్ట్రాలకు వచ్చి ఉద్యోగం చేస్తున్నామన్నారు. చంద్రబాబు విడుదల అయ్యేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.




# సీతమ్మ డెబ్యూ ఫిక్సైంది!

మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ 'సీతారామం'లో సీత పాత్రతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన సంగతి తెలిసిందే. ఈ విజయంతో వెంటనే బిజీ హీరోయిన్ అవుతుందని భావించినా.. అది కాస్త ఆలస్యంగా జరుగుతోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ నాని..విజయ్ దేవరకొండ సినిమాల్లో నటిస్తోంది. ఈ నేపథ్యంలో అమ్మడికి మరో జాక్ పాట్ తగిలింది. ఇదే మూవ్ మెంట్ లో కోలీవుడ్ లో కూడా లాంచ్ అవుతుంది. అదీ అగ్ర దర్శకుడు మురగదాస్ సినిమాతో ఎంట్రీ ఇవ్వడం సంచలనంగా మారింది. అవును. ముగరదాస్ కొత్త చిత్రంలో బ్యూటీ లాక్ అయినట్లు తెలుస్తోంది. శివ కార్తికేయన్ హీరోగా ముగరదాస్ ఓ భారీ బడ్జెట్ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం పలువురి భామల్ని పరిశీలించి చివరిగా మృణాల్ ఠాకూర్ ని



ఎంపిక చేసారు. స్టోరీ నచ్చడం సహా పెద్ద సినిమాలో ఛాన్స్ రావడంతో మృణాల్ మరో ఆలోచన లేకుండా సైన్ చేసింది. ప్రస్తుతం మృణాల్ పై టెస్ట్ షూట్ నిర్వహించడానికి మురగదాస్ సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఇక్కడో ట్విస్ట్ ఉంది. టెస్ట్ షూట్ లో పాస్ అయితేనే అవకాశం. లేదంటే నిర్మోహ మాటంగా ప్రాజెక్ట్ నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. సాధారణంగా హీరోయిన్ల విషయంలో మురగదాస్ టెస్ట్ షూట్ లు నిర్వహించారు. ఆయన కథ అంతా హీరోల చుట్టూనే తిరుగుతుంది కాబట్టి...హీరోయిన్లకు అంత ప్రాధాన్యత ఉండదు. కానీ శివకార్తికేయన్ సినిమా లో హీరోయిన్ పాత్ర కి ప్రాధాన్య ఉండటంతో టెస్ట్ షూట్ వరకూ తీసుకురావడానికి మురగదాస్ కి చాలా సమయం పట్టిందిట. పాత్ర పరంగా యాప్ట్ అవుతుందని మృణాల్ని తీసుకున్నారు. అయితే టెస్ట్ తర్వాతనే మృణాల్ కొనసాగుతుందా? లేదా? అన్నది క్లారిటీ వస్తుందని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. హీరో ఇమేజ్ బేస్ట్ చిత్రాల్లో స్టార్ హీరోయిన్ తీసుకుంటే వాళ్లకి ఎలాంటి టెస్ట్ షూట్ ఉండదు.

కానీ మృణాల్ కెరీర్ ఈ మధ్యనే మొదలవ్వడంతో టెస్ట్ షూట్ కూడా అనివార్యమని భావించినట్లు తెలుస్తోంది.

# కియరా రెడ్ హాట్ కిల్లర్ లుక్

టాలీవుడ్ బాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా ఓ వెలుగు వెలుగుతోంది కియరా అద్వాణీ. ఇప్పుడు ఆస్కార్ విన్నింగ్ ఆర్.ఆర్.ఆర్ నటుడు.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్ ఛేంజర్'(ఆర్.సి 15) లోను నటిస్తోంది. ఈ సినిమాతో కియరా పాన్ ఇండియా స్టార్ డమ్ ని అందుకోనుంది. తనకు తానుగానే గేమ్ ఛేంజర్ గా దూసుకుపోయేందుకు ఇంకెంతో సమయం లేదని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అసాధారణ స్టార్ డమ్ ని ఆస్వాధిస్తూ నేటితరం నాయికల్లో క్రేజీ ఎర్నర్ గా గుర్తింపు తెచ్చుకున్న కియరా ఒక్కో సినిమాకి 3-4 కోట్లు వసూలు చేస్తోంది. హిందీ పరిశ్రమలో పారితోషికం పరంగా మరో మెట్టు పైనే ఉందని తెలిసింది. అలాగే సోషల్ మీడియా పోస్టింగులతోను నిరంతరం బజ్ క్రియేట్ చేస్తున్న కియరా ఈ వేదికలపైనా యాడ్ పోస్టింగులతో భారీగా ఆర్జిస్తోంది. మరోవైపు కియరా నిరంతరం కిల్లర్ హాట్ ఫోటోషూట్లతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. తాజాగా కియరా రెడ్ హాట్ లుక్ ని షేర్ చేయగా అది అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. రెడ్ థై స్లిట్ మఖమల్ డిజైనర్ ఫ్రాకులో కియరా



టూ హాట్ గా కనిపిస్తోంది. నిజానికి థై స్లిట్ ఎలివేషన్ ఇదే తొలిసారి కాదు. కానీ ఈసారి సంథింగ్ స్పెషల్ గా టూహాట్ గా కియరా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ఈ ఫోటోలను జోరుగా వైరల్ చేస్తున్నారు. ఇక ఇటీవలే తన ప్రియుడు సిద్ధార్థ్ మల్హోత్రాని పెళ్లాడేసిన కియరా పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉంది? అని ప్రశ్నించగా.. దానికి ఆసక్తికర సమాధానమిచ్చారు. సిద్ధార్థ్ మల్హోత్రా - కియారా అద్వానీ ఇటీవల ముంబైలో జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో తమ చిత్రాలలో అత్యుత్తమ నటనకు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. అనంతరం కియారా అద్వానీని ముంబై విమానాశ్రయంలో ఒక ఫోటోగ్రాఫర్ "మేడమ్ ఆప్ కీ మ్యారేజ్ లైఫ్ కైసీ హై?" అని అడిగారు. కియారా మొదట్లో హాయిగా ఉందనే ఎక్స్ ప్రెషన్ ఇచ్చింది. కెమెరా వైపు తన ముఖాన్ని తిప్పి గేట్ నుండి ప్రవేశించే ముందు "సబ్ సాహీ హై" అని చెప్పింది. షేర్షా-భూల్ భూలైయా 2-జుగ్ జగ్ జియో -గోవింద నామ్ మేరా లాంటి చిత్రాలలో తన నటనకు కియారా స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకోగా.. షేర్షాలో తన పాత్రకు సిద్ధార్థ్ ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నాడు. ఈ జంట షేర్షా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెళ్లి బంధంతో ఒకటయ్యారు. ఇప్పుడు మళ్లీ కెరీర్ పరంగా ఎవరికి వారు బిజీ అయిపోయారు. 2023 ఫిబ్రవరి 7 న జైసల్మేర్ - సూర్యగఢ్ ప్యాలెస్ లో వివాహం జరిగింది.

# ముగ్గురు భామలతో మల్టీస్టారర్ ఇంట్రెస్టింగ్!



సాధారణంగా ఏ పరిశ్రమలోనైనా స్టార్ హీరోల మల్టీస్టారర్ చిత్రాలు మాత్రమే తెరకెక్కుతుంటాయి. అదే పని ముగ్గురు స్టార్ హీరోయిన్లను పెట్టి చేస్తే అది పెద్ద సాహసం అవుతుంది. వాళ్లతో కేవలం లేడీ ఓరియేంటెడ్ చిత్రాలే ఎక్కువగా చేస్తుంటారు. అదీ వాళ్ల స్టార్ ఇమేజ్ పతాక స్థాయిలో ఉంటేనే సాధ్యమ వుతుంది. తాజాగా బాలీవుడ్ లో ముగ్గురు భామలతో ఓ మల్టీస్టారర్ కి రంగం సిద్ధమవుతోంది. కరీనా కపూర్.. టబు..కృతి సనన్ ప్రధాన పాత్రలో రాజేష్ కృష్ణన్ 'దిక్రూ' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఈ సినిమా స్టోరీ లైన కూడా రివీల్ అయింది. సాఫీగా సాగిపోతున్న ముగ్గురు మహిళా ఉద్యోగుల జీవితాల్లో ఒక అనుకోని సంఘటన.. పెద్ద చిక్కులకు కారణమవుతుంది. వాటి నుంచి బయట పడటానికి ఆ ముగ్గురు తప్పుల మీద తప్పులు చేస్తుంటారుట. చివరి వారు ఆ కష్టాల నుంచి బయట పడ్డారా? లేదా? అన్నదే కథ అట. ఇందులో దిల్జీత్ దోసాంజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇందులో కొన్ని అడ్వెంచర్ సన్నివేశా లుంటాయని తెలుస్తోంది. ఇక సినిమాలో టబు..కరీనా కపూర్ ఇద్దరు సీనియర్ భామలే. చాలా సినిమాల్లో నటించిన అనుభవం ఉంది. దాదాపు స్టార్ హీరోలందరితోనూ పనిచేసారు. వెండి తెరపై కొన్ని సాహసోపేతమైన పాత్రలు చేసిన అనుభవం ఉంది. వీళ్లిద్దరితో కృతి సనన్ పోటీ పడాల్సి ఉంది. నటిగా ఇప్పుడిప్పుడే బిజీ అవుతుంది. ఇలాంటి తరుణంలో గొప్ప పాత్ర పోషించే అవకాశం దక్కింది. ఇద్దరు సీనియర్లతో కలిసి పనిచేసే ఛాన్స్ వచ్చింది. మరి ఆ ఇద్దరితో అమ్మడి ప్రయాణం ఎలా సాగుతుందో చూడాలి. ఇటీవలే కృతిసనన్ నటించిన ఆదిపురుష్ ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇక 'ది క్రూ' వచ్చే ఏడాది మార్చిలో సినిమా విడుదల కానుంది. అప్పటివరకూ సినిమా షూటింగ్..పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతాయని తెలుస్తోంది. ఏక్తకపూర్-రియా కపూర్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# హీరోయిన్స్ మల్టీస్టారర్ మూవీకి అన్నీ కష్టాలే



బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ అనగానే గుర్తుకు వచ్చే పేర్లలో ప్రియాంక చోప్రా.. ఆలియా భట్.. కత్రీనా కైఫ్. ఈ ముగ్గురు కలిసి నటిస్తే.. ఒక లేడీ ఓరియంటెడ్ కమర్షియల్ సినిమా చేస్తే ఎలా ఉంటుందో అనే ఊహ అద్భుతంగా ఉంది కదా.. ఈ కాంబోలో ఒక సినిమా కు ఫర్హాన్ అక్తర్ ప్రయత్నాలు చేశాడు. 2021 సంవత్సరంలో అతడు జీ లే జరా అనే సినిమాను ప్రకటించాడు. ముగ్గురు స్టార్ హీరోయిన్స్ ను నటింపజేస్తున్నట్లుగా ప్రకటన వచ్చింది.

ముగ్గురు ముద్దుగుమ్మలు కూడా నేను ఓకే అంటే నేను ఓకే అంటూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగింది. కానీ తీరా షూటింగ్ సమయం దగ్గరకు వచ్చేప్పటికి అంతా కూడా నా వల్ల కాదు అన్నట్లుగా తప్పుకుంటున్నారు. ఇప్పటికే ప్రియాంక చోప్రా మరియు కత్రీనా కైఫ్ లు సినిమా నుంచి తప్పుకుంటున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. కారణం సినిమా షూటింగ్ ఆలస్యం అవ్వడంతో ఇతర ప్రాజెక్ట్ లతో ముందస్తుగా కమిట్ అయ్యి ఉండటం వల్ల జీ లే జరా సినిమాకు డేట్లు ఇచ్చే పరిస్థితి లేదు అంటూ వారి సన్నిహితులు బాలీవుడ్ మీడియాకు ఆఫ్ ది రికార్డ్ చెబుతున్నట్లుగా తెలుస్తోంది. 2024 సంవత్సరంలో జీ లే జరా సినిమాను మొదలు పెట్టాలని దర్శకుడు ఫర్హాన్ అక్తర్ భావించాడు. కానీ సినిమా నుండి మెయిన్ లీడ్ హీరోయిన్స్ తప్పుకోవడంతో ఆయన ఏం చేస్తాడు అంటూ అంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సాధారణంగా హీరోల మల్టీస్టారర్ వస్తే సందడే సందడి ఉంటుంది. అలాంటిది ముగ్గురు స్టార్ హీరోయిన్స్ మల్టీ స్టారర్ అనగానే అంత కూడా ఆసక్తి కనబర్చారు. కానీ ఇప్పుడు ఆ సినిమా నుండి హీరోయిన్స్ తప్పుకుంటున్న నేపథ్యంలో సినీ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రైవేట్ పార్ట్స్ పై రచ్చ. అనసూయ కామెంట్స్..!

టాలీవుడ్ హాట్ యాంకర్ అనగానే ముందుగా అనసూయ పేరు వినపడుతుంది. జబర్దస్త్ కామెడీ షోకి యాంకర్ గా ప్రయాణం మొదలుపెట్టిన ఆమె ప్రస్తుతం టాలీవుడ్ బిజీ నటిగా మారిపోయింది. ఎప్పుడైతే రంగస్థలం సినిమా చేసిందో అప్పటి నుంచి ఆమెకు వరసగా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. నటిగా తన కెరీర్ కి ఉపయోగపడే పాత్రలను ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. ఇదంతా ఓ వైపు అయితే ఆమె నిత్యం ఏదో ఒక వివాదాల్లో చిక్కుకుంటూనే ఉంటుంది. ఇక మరోసారి ఊహించని విధంగా రియాక్ట్ అయిన అనసూయ వార్తల్లో నిలిచింది. ఇంతకీ అసలు మ్యాటరేంటంటే ఇటీవల యాంకర్ రష్మి గౌతమ్ హిందూ మతం గురించి కామెంట్ చేసింది. హిందూ మతం కులాలు మత మార్పిడుల టాపిక్పై రీసెంట్గా కొన్ని కాంట్రవర్సీ కామెంట్స్ చేసింది. దీనిపై కొందరు ఆమెతో వాగ్వాదానికి



దిగారు. అయితే ఈ విషయంలో ఆమె ధైర్యంగా మాట్లాడటంపై ఓ అభిమాని తనను ప్రశంసిస్తూ ట్వీట్ చేశాడు. 'బాల్స్ కలిగిన సినీ పరిశ్రమకు చెందిన కొందరు వ్యక్తులు ఇలాంటి టాపిక్స్ మాట్లాడుతున్నారు' అంటూ ట్వీట్లో అనసూయ పేరు మెన్షన్ చేశాడు. అయితే సదరు ట్వీట్లో అనసూయ ప్రస్తావన తీసుకురావడం అసలు వివాదానికి కారణమైంది. తన ప్రస్తావన తీసుకురావడంతో అనసూయ కూడా వెంటనే రియాక్ట్ అయ్యింది. రియాక్ట్ అవ్వడమే కాకుండా ప్రైవేట్ పార్ట్స్ గురించి మెన్షన్ చేస్తూ అనసూయ కామెంట్ చేయడం ఇప్పుడు వైరల్ గా మారింది. తనకు బాల్స్ లేవని కానీ తనకు పూర్తిగా తెలిసిన విషయాలపై మాట్లాడటానికి V**** ఉందని ఆమె అన్నారు. అలాగే మనలో ప్రతి ఒక్కరికీ వివిధ రకాల టాపిక్స్పై అటెన్షన్ ఉంటుందని ఇక్కడ చాయిసెస్ అనేవి పూర్తిగా వ్యక్తిగతమన్నారు. అందరూ ఒకేలా స్పందించాలనుకోవడం న్యాయం కాదు అంకుల్ అంటూ అనసూయ కామెంట్స్ చేశారు. ఇప్పుడు అనసూయ ట్వీట్ తీవ్ర దుమారం రేపుతోంది. కొందరు ఆమె ధైర్యానికి ఫిదా అయిపోతున్నారు. బలే ఆన్సర్ చెప్పారు అంటూ ప్రశంసిస్తున్నారు. కానీ కొందరు మాత్రం ఇవేమి కామెంట్స్ మరీ ఇంత బోల్డ్ గా సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# టాప్ లెస్ డ్రెస్ లో థైస్ ఎక్స్ ఫోజ్ చేసి కన్నుల విందు

నాని హీరోగా నటించిన ఆహా కళ్యాణం సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ వాణి కపూర్. తెలుగు లో ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా అయినా కూడా అప్పటి నుండి ఇప్పటి వరకు అమ్మడు సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేసినా.. వీడియోలు షేర్ చేసినా కూడా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి నాని హీరోయిన్ వాణి కపూర్ హాట్ ఫొటో షూట్ షేర్ చేసిన అభిమానులతో పాటు అందరిని కూడా షాక్ అయ్యేలా



చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈ మధ్య కాస్త బిజీగా సినిమాలు చేస్తోంది. ఆకట్టుకునే రూపం ఈ అమ్మడి సొంతం.. అంతే కాకుండా ఫిజిక్ విషయంలో ఈ అమ్మడి తర్వాతే మరెవరైనా అన్నట్లుగా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలకు మోస్ట్ వాంటెడ్ అన్నట్లుగా ఉంటూ.. రొమాంటిక్ సన్నివేశాల్లో ఎలా నటించినా కూడా ఆహా అనిపించే విధంగా ఉండే వాణి కపూర్ ఈ ఫొటోలు చాలా మంది గుండెలకు గుచ్చుకుంటున్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టాప్ లెస్ సింగిల్ పీస్ డ్రెస్ లో ఈ అమ్మడు థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చేసిన ఫొటో షూట్ కు సాధారణంగానే అంతా కూడా ఫిదా అవ్వాల్సిందే. అలాంటిది వాణి కపూర్ వంటి అందాల ముద్దుగుమ్మ షేర్ చేస్తే ఇంకా ఏమైనా ఉందా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# లోక్‌సభ ముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు..

దిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు మంగళవారం లోక్‌సభ ముందుకొచ్చింది. ఈ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ నేడు దిగువ సభలో ప్రవేశపెట్టారు. నారీ శక్తి వందన్ అభియాన్ పేరుతో ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం లోక్‌సభ బుధవారానికి వాయిదా పడింది. సెప్టెంబరు 20 (బుధవారం) నుంచి లోక్‌సభలో దీనిపై చర్చ జరగనుంది. ఆ తర్వాత ఓటింగ్ నిర్వహించి బిల్లుకు ఆమోదం తెలపనున్నారు. ఇక, రాజ్యసభలో ఈ బిల్లును సెప్టెంబరు 21వ తేదీన ప్రవేశపెట్టనున్నారు. కాగా.. కొత్త పార్లమెంట్ భవనంలో ప్రవేశపెట్టిన తొలి బిల్లు ఇదే కావడం విశేషం.

**డీలిమిటేషన్ తర్వాతే మహిళా రిజర్వేషన్లు..!** అయితే, తాజా బిల్లు 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లు కాదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్రం కొత్తగా మరో రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొస్తున్నట్లు తెలిపాయి. అందువల్ల తాజా బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. వాస్తవానికి మహిళా రిజర్వేషన్ బిల్లును 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ప్రవేశపెట్టింది. తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ప్రవేశపెట్టినప్పటికీ ఈ బిల్లు సభ ఆమోదానికి నోచుకోలేదు. చివరకు ఈ బిల్లు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగులోనే ఉండిపోయింది. 2014లో ఆ లోక్‌సభ రద్దు కావడంతో అక్కడ బిల్లు మురిగిపోయింది. ఈ నేపథ్యంలో దాదాపు 27 ఏళ్ల తర్వాత మోదీ సర్కార్.. మహిళా రిజర్వేషన్లపై కొత్త బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ బిల్లు చట్టంగా మారితే.. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే, ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందినప్పటికీ.. 2027 తర్వాత రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని కేంద్రం చెబుతోంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రొటేషన్ ప్రక్రియలో రిజర్వు సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొంది.

## 6 గ్యారెంటీ హామీలని చెబుతున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే

# 6 నెలలకో సీఎం: మంత్రి హరీశ్ రావు



మెదక్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీల కార్డ్ సంతకం లేని పోస్ట్‌డేటెడ్ చెక్ లాంటిదని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమీ చేయకుండా తెలంగాణలో అమలు కాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు. గద్దెనెక్కే వరకు కాంగ్రెస్ వాళ్లు ఏదైనా చెబుతారన్నారు. అధికారం కోసం డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు.. లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి రామని తెలిసి ఏదైనా మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్ళు ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. 6 గ్యారెంటీ హామీలు అని చెబుతున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 నెలలకు ఒక సీఎం వస్తాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ప్రతి 6 నెలలకు ఒకసారి కర్ఫ్యూ వస్తుందన్నారు. 24 గంటల కరెంట్ పోయి రోజుకు ఆరు గంటల కరెంట్ మాత్రమే వస్తుందని, వారానికి రెండు రోజుల పవర్ హాలిడే ఇస్తారని విమర్శించారు. కాంగ్రెస్ వాళ్లకు కొత్తగా బెంగుళూరు హై కమాండ్ వచ్చిందని ఎద్దేవా చేశారు. బెంగుళూరును తెలంగాణకు రెండో రాజధాని చేస్తరు కావచ్చని చెప్పారు. ఇకపై ఢిల్లీకి బెంగుళూరు మీదుగా వెళ్లాల్సి వస్తుందేమోనని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, వారి బోనస్ మాటలు నమ్మి అగం కావద్దని సూచించారు. కన్నతల్లికి అన్నం పెట్టలేనోడు.. పినతల్లికి బంగారు గాజులు కొనిస్తా అన్నట్టు కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని విమర్శించారు. ఎంత సేపు కేసీఆర్?ని తిట్టుడే తప్ప వాళ్లకు మరో పనిలేదన్నారు. కేసీఆర్ అంటే నమ్మకానికి మారుపేరన్నారు. చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకున్న వ్యక్తి సీఎం కేసీఆర్ అని తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇచ్చామని వెల్లడించారు. పనిచేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. బీఆర్ఎస్ మానిఫెస్టో గొప్పగా ఉంటదని, చెప్పిన ప్రతి హామీ నెరవేర్చామని మంత్రి హరీశ్ రావు అన్నారు.

# 'కేసీఆర్ సర్కార్ రోజులు లెక్కబెట్టుకుంటోంది.. ఇంకా 99 రోజులే..!'



హైదరాబాద్: తెలంగాణకు సోనియా గాంధీ రాకతో భాజపా, భారాస, మజ్లిస్ ముసుగులు తొలగిపోయాయని.. ఆ మూడు పార్టీలూ ఒక్కటేనని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ సర్కార్ రోజులు లెక్కబెట్టుకుంటోందన్న రేవంత్.. ఇంకా 99 రోజులే మిగిలి ఉన్నాయన్నారు. కాంగ్రెస్ విజయభేరి సభలో ఆదివారం ప్రకటించిన ఆరు హామీలనూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలుచేసి తీరుతామని స్పష్టంచేశారు. హామీల అమలులో పదేళ్ల కాంగ్రెస్, భారాస పాలనలను ప్రజలు పోల్చి చూడాలని కోరారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలన్నింటిలో పథకాల అమలుపై భారాస విమర్శల్ని తిప్పికొట్టిన ఆయన.. అక్కడి పరిస్థితుల ఆధారంగా ఒక్కో విధానం ఉంటుందన్నారు. పలువురు నేతలతో కలిసి గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. "2023 సెప్టెంబర్ 16, 17, 18 తేదీలు దేశ రాజకీయాల్లో చరిత్రాత్మకమైనవి. హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలు, విజయభేరి సభ, కాంగ్రెస్ అభయహస్తం గ్యారంటీ కార్డులను ప్రజలకు చేరవేసే కార్యక్రమాలు ఈ మూడు రోజుల్లో జరిగాయి. ఈ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ నేతలు, రాష్ట్ర స్థాయి నాయకులు, కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. భారాస నేతలు రాజకీయ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు. బహురూపు వేషాలతో సమావేశాలను అడ్డుకోవాలని చూశారు. సోనియాగాంధీ తెలంగాణకు రావడంతో భారాస, భాజపా, ఎంఐఎంల ముసుగులు తొలగిపోయాయి. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, తెలంగాణ వచ్చాక కేసీఆర్ ఇచ్చిన హామీలపై చర్చ పెట్టాలి. కేసీఆర్‌కు ఏటీఎంగా మారిన ధరణిని రద్దు చేసి తీరుతాం. ధరణిని రద్దు చేసి అంతకంటే మెరుగైన విధానాన్ని తీసుకొస్తాం" అని రేవంత్ రెడ్డి అన్నారు.

## తనతో పాటు సినిమాకు రావాలంటూ కేటీఆర్‌ను ఆహ్వానించిన రాజాసింగ్..



హైదరాబాద్ : తనతో కలిసి మంత్రి కేటీఆర్.. రాజాకార్స్ ఫైల్స్ సినిమా చూడటానికి రావాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ కోరారు. మంత్రి కేటీఆర్‌కు నిజాం పాలన గురించిన చరిత్ర తెలియదన్నారు. తన తండ్రి కేసీఆర్‌ను అడిగి కేటీఆర్.. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అరాచకాల గురించి తెలుసుకోవాలన్నారు. రజాకార్ల ఫైల్స్ చూసిన తర్వాతనే మంత్రి కేటీఆర్ మాట్లాడాలన్నారు. బీజేపీ నేతలు జోకర్లు కాదని హీరోలని రాజాసింగ్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత పోరాటం వల్లే మహిళా రిజర్వేషన్ బిల్లు సాధ్యమైంది : మంత్రి సత్యవతి రాథోడ్


హైదరాబాద్ : జనాభాలో సగమైన తమకు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల సైతం అమలు చేయాలని పోరాడిన ఎమ్మెల్సీ కవిత ఉద్యమం వృథాకాలేదని, కవిత పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదించడంపై మంత్రి సత్యవతి స్పందించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ కృషి ఉందన్నారు. ఈ పోరాట ఫలితంగా లోక్ సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు దక్కనున్నాయి. మహిళా బిల్లుపై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఆకాశంలో సగం, భూమిలో సగం, అధికారంలో సగం నినాదం అమలు కానుందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి లేఖ రాసి సీఎం కేసీఆర్ పెద్ద పాత్ర పోషించారని చెప్పారు. మహిళా బిల్లుపై ఎమ్మెల్సీ కవిత నిర్విరామ పోరాటంతో గెలుపు సాధించాం. 33 శాతం రిజర్వేషన్ అమలుతో దేశ వ్యాప్తంగా మహిళలకు గొప్ప అవకాశం దక్కనుందని పేర్కొన్నారు. గతంలోనూ లోక్‌సభలో ఎంపీగా ఎమ్మెల్సీ కవిత అనేక సందర్భాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు మహిళా సాధికారతపై గళం విప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మార్చిలో ఎమ్మెల్సీ కవితతో కలిసి మేం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయడం, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. కవిత ఒక్క పిలుపుతో దాదాపు 47 రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చారు అని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. పోరాటలకు తలొగ్గే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమెదం తెలిపిందన్నారు.




# మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పందించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లుపై నిర్ణయం తీసుకున్నందుకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. కేంద్ర తీసుకున్న నిర్ణయం వెనుక భారాస కృషి ఉందన్నారు. ఇటీవల కూడా మోదీకి సీఎం కేసీఆర్ లేఖ రాశారన్నారు. బలమైన పార్టీల డిమాండ్ వల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. మహిళా బిల్లుకు భారాస మద్దతు ఇస్తుందన్నారు. "మహిళా బిల్లుపై కేంద్ర మంత్రి వర్గం ఆమోదించినట్లు ప్రసార మాధ్యమాలతో పాటు కేంద్ర మంత్రి ట్వీట్ చేశారు. పార్లమెంట్‌లో ఏ బిల్లు పాస్ చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి కేంద్ర కేబినెట్ ఒక మంచి నిర్ణయం తీసుకుంది. కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. అధికారంలో సగం కావాలన్న మహిళల కల సాకారం కాబోతుంది. మహిళలందరికీ శుభాకాంక్షలు. ఎప్పుడూ మహిళా బిల్లు పార్లమెంట్‌లో పెట్టిన ఏదో ఒక ప్రతిపక్ష పార్టీ అడ్డుపడుతోంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఎటువంటి పరిస్థితుల్లో బిల్లు తీసుకువస్తుంది, విధి విధానాలపైన స్పష్టత ఇవ్వాలి. ప్రభుత్వం వేస్తున్న ముందడుగు అభినందనీయం. 2014లో భారాస అధికారంలోకి రాగానే అసెంబ్లీలో 33శాతం మహిళా రిజర్వేషన్, ఓబీసీ రిజర్వేషన్లను ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. తొమ్మిదేళ్ల జాప్యం తరువాత మహిళా బిల్లుపై కేంద్రం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఓబీసీ, మహిళా రిజర్వేషన్లపై ఇటీవల ప్రధాని మోదీకీ లేఖలు రాశారు. కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశాల్లోనూ మహిళా బిల్లుపై తీర్మానం పాస్ చేసింది" అని కవిత అన్నారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత నివాసం వద్ద మహిళలు, కార్యకర్తలు బాణ సంచా కాల్చి సంబురాలు జరిపారు. అయితే కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ మహిళా రిజర్వేషన్‌కు సంబంధిన బిల్లుపై చేసిన ట్వీట్‌ను కాసేపటి తర్వాత డిలీట్ చేయడం గమనార్హం.

# మోదీకి వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ ఎకసెక్కాలు ఆడుతోంది



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీతో ఉన్న వారే మతచిచ్చు రేపుతున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... నాలుగు వేల సంవత్సరాల చరిత్ర సనాతన ధర్మంకు ఉందన్నారు. ఈ దేశం అన్ని కులమతాలను గౌరవిస్తుందని తెలిపారు. అలాంటి దేశంలో అతి పురాతనమైన సనాతన ధర్మం లేకుండా చేస్తామంటున్నారని మండిపడ్డారు. దేశాభివృద్ధికి ఆటంకాలు కలగాలని కాంగ్రెస్ పార్టీ చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారన్నారు. ప్రపంచంలో మోదీకి వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ నేతలు ఎకసెక్కాలు ఆడుతున్నారని విమర్శించారు. గాంధీ పేరు పెట్టుకుని ఇన్నాళ్లు దేశాన్ని ఏలినా పేదరికం నిర్మూలించలేదన్నారు. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా విశ్వాసం కోల్పోయిందన్నారు. మతచిచ్చు రేపి రాజకీయాలకు వాడుకుంటోందని ఆరోపించారు. తెలంగాణపై, దేశంపై కాంగ్రెస్‌కు ఏమాత్రం ప్రేమ లేదన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉచిత పథకాలతో ఎలాంటి అభివృద్ధి జరగదని కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పారన్నారు. తెలంగాణ ప్రజలు భవిష్యత్తు గురించి మీరు ఆలోచిస్తున్నారా అని బీజేపీ నేత నిలదీశారు. తెలంగాణలో ఆర్టీసీని ఏ స్థాయికి తీసుకువచ్చారో.. కర్ణాటకలో ఇప్పుడు అదే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కర్ణాటకలో ఆర్టీసీని ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. "మా ఎమ్మెల్యేలు పార్టీ మారరు, మేం అధికారంలోకి వస్తే స్కాంలు ఉండవు అనే గ్యారెంటీ ఇవ్వం. తెలంగాణ చరిత్రను కనుమరుగు చేయం అనే హామీ ఇవ్వండి" అని అన్నారు. ఓట్లకోసం పథకాలు తెచ్చే నేత మోదీ కాదన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళడమే బీజేపీ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో అనే విషయాలను బీజేపీ తెప్పించుకుంటుందన్నారు. అందుకు అణుగుణంగా బీజేపీ మేనిఫెస్టో ఉంటుందని తెలిపారు. కవిత లేఖ రాస్తేనే మోదీ మహిళా బిల్లు పెడుతున్నట్టు చెబుతోందన్నారు. ఒక పథకం ప్రకారం మోదీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఉందని గతంలోనే చెప్పామన్నారు. కవిత వ్యవహారం చూస్తే హాస్యాస్పదంగా ఉందన్నారు. "మహిళలను గౌరవించమని మీ నాన్నకు చెప్పు మొదలు. మీ పార్టీ మహిళలకు కానీసం 15 రిజర్వేషన్ అమలు చేశారా.. పార్టీలో ఓ మహిళకు అత్యున్నత పదవి ఇచ్చారా. ఎంతో కష్టపడి నేను రాజకీయాలలో ఎదిగాను. నేను రాజకీయ వారసురాలుగా ఎదగలేదు" అని అన్నారు. ఇండ్లు కేంద్ర ప్రభుత్వం విధులతో కడతారా... రాష్ట్ర నిధులతో కడతారో కూడా కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో , రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రానికి తగిన న్యాయం జరుగుతుందన్నారు. ఒకేసారి బీజేపీకి తెలంగాణలో అధికారం ఇవ్వాలన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న పథకాలు చూసి బీజేపీని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలు తోడు దొంగలు అంటూ డీకే అరుణ వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణ ప్రజలపై ప్రధాని మోడీ మరోసారి విషం కక్కారు



నల్గొండ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో తెలంగాణ ప్రజలపై ప్రధాని మోడీ మరోసారి విషం కక్కారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టేలా కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీమ్స్ తీసుకొచ్చిందన్నారు. ఆచరణకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయొద్దని హితవుపలికారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ స్కీమ్స్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి తెలంగాణ కోసం ఎందుకు రాజీనామా చేయలేదని నిలదీశారు. తెలంగాణ ఉద్యమంలో బీజేపీ పాత్ర లేదన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు కప్పిపుచ్చుకునేందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు తెస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కాంగ్రెస్ కాపీ కొట్టింది: మంత్రి జగదీశ



సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చేది ఉందా? ఇచ్చేది ఉందా? అన్నట్టుగా ఉన్నాయని మంత్రి జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. విజయభేరి సభలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై సూర్యాపేటలో మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అన్నీ బోగస్‌ని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్‌కు ఏనాడూ లేదన్నారు. అధికారం కోసం రాష్ట్ర నేతలు ఇచ్చిన స్క్రిప్ట్‌ను కాంగ్రెస్ అగ్రనేతలు చదివారన్నారు. "ఎలాగైనా అధికారంలోకి రావాలని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కాంగ్రెస్ కాపీ కొట్టింది. హైదరాబాద్‌లో చెప్పిన హామీలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా లేవు. రాష్ట్రానికో మెనిఫెస్టో పెట్టి ప్రజలను కాంగ్రెస్ మోసం చేయాలని చూస్తోంది. చైతన్యవంతులైన తెలంగాణ ప్రజల ముందు వారి పాచికలు పారవు. మోదీ పాలనతో విసుగు చెంది కేసీఆర్ వంటి ప్రత్యామ్నాయం లేనందునే కర్ణాటకలో ప్రజలు మీకు ఓటు వేశారు. వారంటీలు లేని గ్యారెంటీలు ఇచ్చి కర్ణాటకను ఆగం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ చేసిన కాలయాపన వల్లే ఇక్కడ ఆత్మబలిదానాలు జరిగాయి. కాంగ్రెస్ చర్యలతో తెలంగాణ రెండు తరాల భవిష్యత్‌ను కోల్పోయింది" అని మంత్రి జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భారత్ జాగృతి అధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం

నిజామాబాద్ : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడిన ఎమ్మెల్సీ కవిత ఉద్యమం పట్ల సర్వత్రా హర్షం వ్యక్త మవుతున్నది. ఎమ్మెల్సీ కవిత పోరాటానికి తలొగ్గిన కేంద్రం 33 శాతం రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో నిజామాబాద్‌లోని భారత్ జాగృతి అధ్వర్యంలో ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి విద్యార్థినులు, మహిళా నేతలు, జాగృతి నాయకులు పాలాభిషేకం చేశారు. మొదట కేసీఆర్ కమాన్ నుంచి క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీగా తరలివచ్చి పాలభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగానే పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని వారు హర్షం వ్యక్తం చేశారు. మహిళల హక్కుల కోసం గళం వినిపించడంలో ఎమ్మెల్సీ కవిత ఎప్పుడూ ముందు ఉంటారని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా విశేషంగా కృషి చేస్తున్న కవితకు ధన్యవాదాలు తెలిపారు. కవిత పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి బిల్లుకు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. చట్టసభల్లో మహిళల ప్రాధాన్యత గురించి మొదటి నుంచి పోరాడుతున్న కవితకి కృతజ్ఞతలు తెలిపారు. ఇది యావత్ మహిళా లోకం విజయంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు అపర్ణ, సుమనా రెడ్డి, విశాలిని రెడ్డి, భారత జాగృతి జిల్లా అధ్యక్షురాలు అవంతి రావు, నరాల సుధాకర్, లక్ష్మి నారాయణ,చిన్ను గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com